

గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్(జీటీఎస్) నిర్మాణాలు.. నాలుగేళ్లుగా పునాదుల దశ దాటలేదు. ఈ కేంద్రాల కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో చేపట్టిన నిర్మాణాలు ఎందుకూ పనికిరాకుండా పోగా.. మిగిలిన నిధులు వృథాగా పోయాయి. జీటీఎస్ భవనాలు, షెడ్ల కోసం వేసిన పిల్లర్ల ఇనుము తుప్పుపట్టిపోయి విరిగిపోతున్నాయి. మున్సిపల్ పట్టణాల్లో సేకరించే చెత్తను జిందాల్‌కు తరలించేందుకు లారీలకు ఎత్తాల్సిన స్టేషన్లలో చెత్తకు బదులు ముళ్ల చెట్లు పేరుకుపోయాయి. 2020 సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులతో మొదలుపెట్టిన నిర్మాణాలు ప్రస్తుతం ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ఈ కేంద్రాల విలువ తెలుసుకోలేని గత వైసీపీ ప్రభుత్వం అంతే నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడంతో మంజూరైన నిధులు వృథా పోగా, ఖర్చు చేసిన నిధులు చెత్తలో పోసిన చందంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గుంటూరు కార్పొరేషన్‌తో పాటు మిగిలిన మున్సిపాలిటీలకు కలిపి రూ.256.18 కోట్ల నిధులను ఈ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. వీటిలో ఇప్పటి వరకు రూ.86 కోట్లమేర మాత్రమే ఖర్చు చేశారు.

నిధులున్నా.. నిరుపయోగం



తెనాలి బీసీ కాలనీలో నిర్మించాల్సిన గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను కంపోస్ట్ యార్డులో కొంతవరకు నిర్మించి వదిలేసిన చిత్రం

గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్)ల నిర్మాణం పునాదుల్లోనే...

- గత వైసీపీ సర్కారు నిర్వాకం
- కేంద్రం ఇచ్చినా నాలుగేళ్లుగా నిర్లక్ష్యం
- రూ. 256 కోట్ల పనులు అసంపూర్తిగానే..
- బయో మైనింగ్ విధానంలో చెత్తకు పరిష్కారం దిశగా...



పూలే కాలనీలో షెడ్ వేయకుండా వదిలేయటంతో తుప్పు పట్టిపోతున్న పిల్లర్ల ఇనుము

తెనాలి, డిసెంబరు 26, (ఆంధ్రజ్యోతి): చెత్త.. రోజురోజుకూ పట్టణాలను పీడిస్తున్న సమస్య. రోజుకు లక్షల టన్నుల చెత్త పట్టణాల్లో పోగవుతుంటే, దానిని తరలించటం, డంపింగ్ యార్డుల్లో ప్రాసెస్ చేయటం వంటివి ఇబ్బందిగా మారిపోయాయి. పైగా చిన్న వాహనాలు పలుమార్లు చెత్తను డంపింగ్ యార్డులకు తరలించటానికి తిరగటం వల్ల ఖర్చు పెరిగిపోతుందన్న కారణంతో ఈ స్టేషన్‌ల నిర్మాణం చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. అనుకున్నట్టే అన్ని రాష్ట్రాలకు 15వ ఆర్థిక సంఘ నిధులు, ఇతర నిధులను మంజూరు చేసింది. అయితే వీటిని పట్టణానికి నాలుగు దిక్కులా ఏర్పాటుచేసి, చెత్తను సేకరించాల్సి ఉంటుంది. దీనివల్ల ఎన్నోరకాలుగా ఆదా అవుతుంది. ప్రస్తుత పరిస్థితిలో ప్రతి పట్టణానికి చెత్తను డంప్ చేసే కేంద్రం ఒక్కచోటే ఉంటోంది. పట్టణంలో వచ్చిన చెత్త మొత్తాన్ని అక్కడికే తరలించాలి. అంటే పట్టణంలో అన్ని మూలల నుంచి చెత్త వాహనాలు రోజు మొత్తంమీద 10 నుంచి 15 సార్లు తిరగాల్సి వస్తుంది. పెద్ద నగరాలయితే మరింత శ్రమ. చెత్త సేకరణ చేసే చోటు పలుచోట్ల ఉంటే, ప్రాంతాల వారీగా అక్కడికక్కడే చెత్తను దింపేయవచ్చు. అక్కడి నుంచే చెత్తతో సేంద్రియ ఎరువు, విద్యుత్తు తయారుచేసే కేంద్రాలకు తరలించవచ్చు. మన జిల్లాకు ప్రస్తుతం చిలకలూరిపేటలోని జిందాల్ చేపట్టిన ప్రాజెక్టుకు తరలిస్తున్నారు. ఈ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల ఏర్పాటు వల్ల చెత్తను తీసుకొచ్చే వాహనాలు తిరిగే దూరం తగ్గటం వల్ల ఇంధనం ఆదా అవుతుంది. సమయం కలిసివస్తుంది. దీనికితోడు పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య కూడా తగ్గుతుంది. చెత్త వాహనాలు జనం తిరిగే సమయంలో వెళితే దుర్గంధంతో వాయు కాలుష్యంకూడా ఏర్పడుతోంది. దీనివల్ల అదికూడా చాలావరకు తగ్గుతుందనేది కేంద్రం ఆలోచన. దీనిని గత వైసీపీ సర్కారు పూర్తిగా పక్కన పెట్టేసింది. అసలు ఈ కేంద్రాల నిర్మాణం పూర్తిచేసిన దాఖలాలే లేవు.

పునాదుల దశలోనే లక్ష్యానికి తుప్పు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్(జి.టి.ఎస్)స్టేషన్‌ల నిర్మాణం పునాదులకే పరిమితమయింది. ఎక్కడా పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగి, ఉపయోగంలోకి వచ్చిన పరిస్థితి లేదు. తెనాలిలో మూడు చోట్ల జీటీఎస్‌ల నిర్మాణం రూ. 2.16 కోట్లతో 2020లో చేపడితే, అవి అస్తవ్యస్తంగా మారాయి. సాధారణంగా డంపింగ్ కేంద్రం ఉన్నచోట కాకుండా, మిగిలిన ప్రాంతాల్లో ఈ కేంద్రాలను నిర్మించాల్సిఉంటే, పట్టణంలోని పూలే కాలనీ, బీసీ కాలనీ, పినపాడులో చేపట్టారు. అయితే ఇక్కడ ఒక్క పినపాడు మినహా, మిగిలిన రెండూ డంపింగ్ యార్డుకు దగ్గర్లోనే ఉండటం విశేషం. దీనిలో బీసీ కాలనీలో నిర్మించాల్సిన స్టేషన్‌ను ఏకంగా యార్డులోనే పెట్టేశారు. ఇక్కడ కంపోస్ట్ యార్డుకు దూరంగా ఉన్న ప్రాంతాల్లో వీటిని నిర్మించాల్సిఉంటే, బీసీ కాలనీలో జనం ఒప్పుకోలేదని

(మిగతా 8వ పేజీలో)

సాగునీరు పారుదల కావాల్సిన కాల్వల నిధులపై కూటమి నేతలు కన్నేశారు. ఇప్పటికే ఇసుక.. మట్టి.. రేషన్.. మాఫియాలతో అంటకాగుతున్న కొందరు నేతల కన్ను సాగర్ కాల్వల మరమ్మతులపై పడింది. అధికారం అండతో కొందరు నేతలు రెచ్చిపోతున్నారు. కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయగా అధికారులు వాటికి టెండర్లు పిలిచారు. అయితే వాటిని రద్దు చేసి తమ వారికి కట్టబెట్టాలని కొందరు నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చారని సమాచారం. టెండర్లను రద్దు చేయాలని హుకుం జారీ చేశారని తెలిసింది. ఈ పరిస్థితుల్లో అధికారులు టెండర్లను రద్దు చేసినట్లు తెలుస్తోంది. వైసీపీ హయాంలో పనులు చేయకుండానే ఆ పార్టీ నేతలు కొందరు బినామీల పేరుతో నిధులు స్వాహా చేయగా అదే బాటలో కూటమి నేతలు పయనిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేసి నెలలు గడుస్తున్నా పనులు చేపట్టలేని దుస్థితిలో జలవనరుల శాఖ ఉంది.



చిలకలూరిపేట మేజర్ కాలువలో పెరిగిన జమ్ము, కంప

కాల్వలపై.. కూటమి నేతల కన్ను



- మరమ్మతులకు నిధుల విడుదల
- టెండర్లు పిలిచిన జలవనరుల శాఖ
- రద్దు చేయాలంటూ నేతల ఒత్తిడి
- నిలిచిపోయిన పనులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలో కాలువల మరమ్మతులకు గత ఐదేళ్లు నిధులు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం పాడుబెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాల్వల మరమ్మతులకు రూ. 17.69 కోట్ల నిధులు విడుదల చేసి, అత్యవసర పనులు చేపట్టాలని ఆదేశించింది. అయితే పల్నాడు జిల్లాలో కొన్ని చోట్ల ఈ పనులను అధికార నేతలే అడ్డుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా జలవనరుల శాఖ మరమ్మతులకు సంబంధించి, టెండర్లు కూడా పిలిచింది. వాటికి సంబంధించి కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లు కుదుర్చుకునే సమయంలో, అధికార పార్టీ నేతల ఒత్తిడితో సదరు అధికారులు టెండర్లను రద్దు చేసినట్టు ప్రచారం. తాము చెప్పే వరకు టెండర్లు ఖరారు చేయడానికి వీలు లేదని అధికారులకు తేల్చి చెప్పడంతో, టెండర్ల దశలోనే మరమ్మతుల పనులు నిలిచిపోయాయని ప్రచారం. టెండర్లు రద్దు అంశాన్ని జలవనరులశాఖ ఉన్నతాధికారులు, మంత్రి దృష్టికి సదరు అధికారులు తీసుకువెళ్లినట్టు సమాచారం. కొందరు నేతలు మరమ్మతు పనులు ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. తమకు చెందిన వ్యక్తుల పేరుపై టెండర్లు దాఖలు చేయించి పనులు చేసుకోవాలన్న ప్రయత్నాల్లో భాగమే టెండర్లు రద్దు అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సాగర్ కాలువ కింద మేజర్లు, మైనర్‌లు, సబ్‌మైనర్ కాలువలు శిథిల స్థితికి చేరుకున్నాయి. రానున్న రోజుల్లో సాగునీటి సరఫరాకు ఇబ్బందులు వచ్చే పరిస్థితి ఏర్పడింది. కాలువల్లో కంప చెట్లు పెద్ద ఎత్తున పెరిగాయి. జమ్ము, తూటుకాడ, రబ్బరు మొక్కలు కాలువల నిండా అల్లుకుపోయాయి. ఇవి నీటి సరఫరాకు అవరోధంగా మారే ప్రమాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో తక్షణావసరమైన పనులు చేపట్టాలని ప్రభుత్వం జలవనరుల శాఖ అధికారులకు సూచించింది. ఈ మేరకు పనులను గుర్తించారు. పనులకు సంబంధించిన అంచనాలను రూపొందించారు.

సాగర్ లింగంగుంట్ల సర్కిల్ పరిధిలో 302 పనులను గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు రూ. 17.69 కోట్లు వ్యయం అంచనా వేశారు. లింగంగుంట్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 76 పనులు, ఇందుకు వ్యయం అంచనా రూ. 4.21 కోట్లు. మాచర్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 101 పనులు, వ్యయం అంచనా రూ. 4.69 కోట్లు. ఓఅండ్ఎం డివిజన్ సత్తెనపల్లి పరిధిలో 62 పనులు



గోవిందాపురం మైనర్ కాలువలో పెరిగిన కంప చెట్లు

(మిగతా 8వ పేజీలో)



అగ్రవర్ణాలకీ.. రుణం

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లు వైసీపీ పాలనలో అలంకార ప్రాయంగా మారాయి. రూపాయి నిధులు కూడా ఆయా కార్పొరేషన్లకు అందలేదు. ఆయా వర్గాల సంక్షేమం గురించి ఆలోచించలేదు. అగ్రవర్ణ పేదలకు కేటాయించే రుణాలకు కూడా జగన్ ప్రభుత్వం మంగళం పాడింది. స్వయం ఉపాధి రంగాలలో ప్రభుత్వం అందించే రాయితీ రుణాల కోసం ఐదేళ్ల పాటు ఆశావహులకు ఎదురుచూపులే మిగిలాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆయా కార్పొరేషన్లకు జవసత్వాలు కల్పించే దిశగా కార్యాచరణ మొదలుపెట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే బీసీ రుణాలకు సంబంధించి స్పష్టత ఇచ్చింది. త్వరలోనే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మొదలుకానుంది. ఈ క్రమంలో ఈబీసీ కింద అగ్రవర్ణ పేదలకూ 50 శాతం రాయితీ కింద బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలివ్వాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే జిల్లాల వారీగా కేటాయింపులు కూడా జరిపింది.

ఈబీసీ కింద మంజూరుకు సన్నాహాలు

- ❖ మూడు జిల్లాల పరిధిలో రూ.96 కోట్లు కేటాయింపు
- ❖ ఆరు రంగాలు ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక
- ❖ కసరత్తు మొదలు పెట్టిన బీసీ కార్పొరేషన్ అధికారులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) అగ్రవర్ణ పేదలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఈబీసీ కింద రాయితీపై రుణాలిచ్చే ప్రక్రియ 2014–19 మధ్య కార్పొరేషన్ల ద్వారా జరిగింది. కానీ గత ప్రభుత్వంలో ఆ నిధులను సైతం యథేచ్ఛగా దారి మళ్లించి ఈబీసీ పేదలను దగా చేసింది. 2019–24 మధ్య ఈబీసీకింద స్వయం ఉపాధి యూనిట్లు పెట్టుకోవడానికి రాయితీ రుణాలు మంజూరు చేయాలనే అభ్యర్థనలు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 15,000 వరకు వచ్చినట్లు సమాచారం. వీటిలో ఏ ఒక్క దరఖాస్తును పరిష్కరించకపోగా ఆ నిధులనూ సైతం ఇష్టారీతిన దారి మళ్లించిన ఘనత గత ప్రభుత్వానిది కావడం గమనార్హం

ఆరు రంగాలలో...

రాయితీపై రుణాలు అందించే యూనిట్లను మొత్తం ఆరు రంగాలుగా ప్రభుత్వం వర్గీకరించింది. ఫ్యాషన్ డిజైనింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, డెయిరీలు, జనరిక్ మందుల షాపులు, హాస్పిటల్ సెక్టార్‌తో పాటు ఇతర స్వయం ఉపాధి యూనిట్ల కింద రుణాలు మంజూరు చేయనున్నారు. ఈబీసీతో పాటు రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రా హ్మణ విభాగాలలో అగ్రవర్ణ పేదల కింద లబ్ధిదారులను ఎంపిక జరిపి వారికి లబ్ధి చేకూర్చే విధంగా బీసీ కార్పొరేషన్ కసరత్తు మొదలు పెట్టింది. లబ్ధిదారుల ఎంపికలో భాగంగా ఆయా రంగాలలో ఆసక్తి కనబరుస్తున్న వారి నైపుణ్యాలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. అవసరమైతే వారికి ప్రభుత్వమే శిక్షణ ఇచ్చి యూని ట్లను మంజూరు చేసి వారు నిలదొక్కుకునేలా చేయడానికి అన్నివిధాల సహకారం అందించనుంది

మూడు జిల్లాలకు కలిపి రూ.96 కోట్ల రుణాలు

ఈబీసీ కోటా కింద అగ్రవర్ణ పేదలకు రుణాలు మంజూరులో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే నిధులు కేటాయింపు జరుపుతూ బీసీ కార్పొరేషన్ అధికారులకు మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. దానిలో భాగంగా బాపట్ల జిల్లాలో మొత్తం 3,609 మందికి లబ్ధి చేకూర్చాలని నిర్ణయించింది. నిధుల కేటాయింపు వచ్చేసరికి మొత్తం రూ.23 కోట్లు కాగా ఇందులో సబ్సిడీ కింద రూ.15 కోట్లు పోగా బ్యాంకు రుణం కింద రూ.8 కోట్లు లబ్ధిదారులకు అందించనున్నారు. ఇక గుంటూరు, పల్నాడు జిల్లాలకు కలిపి మొత్తం 9,838 లబ్ధిదారులను ఈబీసీ కింద ఎంపిక చేసి రాయితీ కింద రుణాలు అందించనున్నారు. మొత్తం రూ.63 కోట్లను ఇందుకు ప్రభుత్వం కేటాయించగా ఇందులో రూ.42 కోట్లు రాయితీ రూపంలోనూ, రూ.21 కోట్లు బ్యాంకురుణాల ద్వారా లబ్ధిదారులకు మేలు జరగనుంది. ఈబీసీ కింద రుణాల విషయంలో రూ.63 కోట్లను గుంటూరు, పల్నాడు జిల్లాలకు కలిపే ప్రస్తుతానికి బీసీ కార్పొరేషన్ చూపిస్తుంది. త్వరలోనే జనాభా ప్రాతిపదికన ఈ కేటాయింపులను రెండు జిల్లాలకు విభజించి ప్రక్రియ మొదలుపెట్టే దిశగా యంత్రాంగం అడుగులు వేయనుంది.

మహిళలకే అగ్ర తాంబూలం

స్వయం ఉపాధి యూనిట్లకోసం రుణాల మంజూరులో భాగంగా మహిళలకే పెద్ద పీట వేయనున్నారు. దానిలో భాగంగానే కేటాయింపుల్లో ఎక్కువ శాతం ఫ్యాషన్ డిజైనింగ్ విభాగానికే కేటాయించారు. ఈ రంగంలో మహిళలకు శిక్షణ ఇవ్వడంతో పాటు యూనిట్ ఏర్పాటుకు ఒక్కొక్కరికి రూ.25,000 చొప్పున నగదు అందించడంతో పాటు కుట్టుమిషన్ కూడా అందించనున్నారు. ఇక ఈవెంట్ మేనేజ్‌మెంట్ కింద రూ.50,000, టూరిజం మేనేజ్‌మెంట్ కింద రూ.25,000 అందించడంతో పాటు ఆయారంగాలలో శిక్షణ కూడా ప్రభుత్వమే ఇప్పించే విధంగా చర్యలు చేపడుతోంది.



జనరిక్ మందుల దుకాణాలకు సంబంధించి బీఫార్మసీ తదితర అర్హతలు ఉన్నవారికి శిక్షణ ఇప్పించి యూనిట్ మంజూరు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాల వారీగా నిధుల మంజూరుతో పాటు లబ్ధిదారుల సంఖ్య పై కూడా ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ చేపట్టి ఎంపి కయిన లబ్ధిదారులతో మాట్లాడడం, శిక్షణ వంటి ప్రక్రియలన్నీ శరవేగంగా పూర్తి చేసి మరో నెల రోజుల్లోనే రాయితీ రుణాల అంశాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఏఎస్ఐ మృతి

బాపట్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణ స్టేషన్‌లో పని చేసే ఏఎస్ఐ డి.కొండయ్య(59) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శృంగారపురంలో అద్దె ఇంట్లో నివసిస్తూ ఆయన రోజూ విధులకు హాజరవుతుండేవారు. ఈ క్రమంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా త్వరగా విధులు ముగించుకుని బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై బాపట్ల నుంచి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో వాహనం అదుపుతప్పి ఏఎస్ఐ కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే అపస్మాకరస్థితిలో చేరిన కొండయ్య చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. ఏఎస్ఐ మృతికి పోలీసు ఉన్నతాధికారులు సంతాపం తెలిపారు.

గిరిజనులకు నేడు ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్

బాపట్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజనుల సమస్యల పరిష్కారం కొరకు శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో జరిగే ఈ కార్యక్రమాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

31న యలమందలలో సీఎం పర్యటన

◆ సభాస్థలిని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

6



నరసరావుపేట నియోజకవర్గం యలమందలలో సీఎం చంద్రబాబు పర్యటనకు స్థల పరిశీలన చేస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

6



జెస్సీరాజ్‌కు పీఎం బాల పురస్కార్ ప్రదానం

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జెస్సీరాజ్

ఆర్టీసీ ఉద్యోగులకు నైట్ అలవెన్స్

- వైసీపీ హయాంలో రద్దు
- కూటమి ప్రభుత్వంలో పునరుద్ధరణ

డీఆర్ఎంగా ఆనంద్ మధుకర్



గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్(డీఆర్ఎం)గా ఆనంద్‌మధుకర్ నియమితులయ్యారు. ఈ మేరకు రైల్వే బోర్డు డైరెక్టర్ రవీందర్‌పాండే గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇండియన్ రైల్వే పర్సనల్ సర్వీసు (ఐఆర్‌పీఎస్) 1977 సివిల్ సర్వీసు ఎగ్జామినేషన్ బ్యాచ్‌కు చెందిన మధుకర్ కేంద్ర ఆర్థిక శాఖలో కొంతకాలం జాయింట్ సెక్రెటరి హోదా పోస్టులో ఓఎస్‌డీగా విధులు నిర్వహించారు. సౌత్ ఈస్టు రైల్వేలో ఆయన ఎక్కువ కాలం వివిధ హోదాలలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం డిప్యూటేషన్‌పై కేంద్ర పురావస్తు శాఖలో అదనపు డైరెక్టర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2029 వరకు డిప్యుటేషన్ ఉన్నప్పటికీ రైల్వేబోర్డు ఆయన్ని వెనక్కు రప్పించి గుంటూరు డీఆర్ఎంగా పోస్టింగ్ చేసింది. కాగా ప్రస్తుత డీఆర్ఎం రామకృష్ణకు ఇంకా పోస్టింగ్ కల్పించలేదు.

జనం దృష్టి మళ్లించేందుకే వైసీపీ దొంగ దీక్షలు

చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ ఒప్పందాల లంచాల కేసుల్లో అడ్డంగా ఇరుక్కున్న వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి జనం దృష్టి మళ్ళించేందుకు పోరుబాట పేరుతో దొంగ దీక్షలకు దిగుతున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో తొమ్మిదిసార్లు విద్యుత్‌చార్జీలు పెంచారని, వైసీపీ ప్రభుత్వం రెండు నెలల్లో దిగిపోతూ కూడా పేదలపై పన్నెండున్నర వేల కోట్ల రూపాయల భారం వేసి, ఆ భారంపై ఇప్పుడు దొంగ దీక్షలకు దిగటం హాస్యాస్పదంగా ఉందన్నారు. క్విడ్ ప్రో కోను విద్యుత్ రంగానికి కూడా విస్తరించి అడ్డగోలుగా దోచుకున్న జగన్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ చార్జీలపై పోరుబాటకు పిలుపునివ్వటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకసారి అధికారం ఇచ్చిన పాపానికి ఒక్కొక్క కుటుంబంపై సగటున రూ.4వేలు భారం మోపారని, ఐదేళ్ళలో ప్రజలపై మొత్తం రూ.20వేల కోట్లు భారం వేసింది మరిచిపోయారా అంటూ నిలదీశారు. ఎస్సీ, ఎస్టీ ఉచిత విద్యుత్‌కు మంగళం పాడింది, విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాన్ని 1.14లక్షల కోట్లకు చేర్చి అప్పుల్లో ముంచి దివాళ తీయించింది జగన్ కాదా అని దుయ్యబట్టారు. పరిశ్రమలకు పవర్ హాలిడేలు, రైతన్నలకు వద్దన్న మీటర్లు పెట్టి విద్యుత్ రంగాన్ని చిమ్మ చీకటిలోకి నెట్టిన వ్యక్తి జగన్మోహనరెడ్డి అన్నారు. జగన్‌ను ఇంకా ప్రజలు నమ్ముతారనుకోవడం భ్రమేనన్నారు. పార్టీని వీడి నాయకులు వెళ్ళిపోతుండటంతో పార్టీలో మిగిలింది ఎవరో, తన మాట వినేది ఎవరో తెలుసుకునేందుకే జగన్ పోరుబాట అంటూ పిలుపునిచ్చారని ఎద్దేవా చేశారు. సొంత జిల్లా కడపలో పట్టుమని 10మందిని ఆందోళనకు పోగుచేయలేని వ్యక్తి వైసీపీని నడపడం, కాపాడుకోవడం కూడా అనుమానమేనని అన్నారు.

కరెంటు చార్జీల పెంపు భారం నీది కాదా జగన్..?

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరెంట్ చార్జీల పెంపు పాపం నీది కాదా జగన్ అంటూ టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి, అనాలోచిత విధానాలే విద్యుత్ భారానికి కారణం అని కొమ్మాలపాటి శ్రీధర్ విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ చార్జీల పెంపుపై కలెక్టరేట్‌ల వద్ద ధర్నా చేస్తానని చెప్పడం చూస్తుంటే తాను పెంచిన విద్యుత్ చార్జీలపై తానే ధర్నా చేయడం దేశ చరిత్రలో ఎక్కడా లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి వలన రాష్ట్రంలో రూ.1.29 లక్షల కోట్లు విద్యుత్ భారం పడిందని, విద్యుత్ సంస్థలపై పెరిగిన అప్పుల భారం రూ.49,500 కోట్లు, విద్యుత్ వినియోగదారులపై రూ.32వేల కోట్లు, వీటీపీఎస్, కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్ జాప్యం, పోలవరం హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టు జాప్యం వలన సుమారుగా రూ.17వేల కోట్లు ఇలా మొత్తం విద్యుత్ భారం పెరిగిందన్నారు. ఏపీ డిస్కం నిర్వహణ లోపం వలన, జెన్కో ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి లోపం వలన మొత్తం రూ.1.29లక్షల కోట్ల విద్యుత్ భారం పడిందన్నారు. చేతగాని అసమర్థ, అవినీతి పాలన వలన ఏర్పడిన విద్యుత్ భారం ట్రూ ఆప్ చార్జీలు, ఎఫ్‌పీసీపీపీ చార్జీలు రూపంలో వినియోగదారులపై పెనుభారాన్ని మోపాయని వివరించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు నైట్ అలవెన్స్



● వైసీపీ హయాంలో రద్దు ● కూటమి ప్రభుత్వంలో పునరుద్ధరణ ● ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్స్‌లో హర్షాతిరేకాలు

గుంటూరు, సత్తెనపల్లి డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేసే డ్రైవర్, కండక్టర్స్‌కు కూటమి ప్రభుత్వం తన ఉదారతను చాటుకుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రద్దయిన నైట్ అవుట్ అలవెన్స్ అమలు చేస్తూ జీవో జారీ చేసింది. గతంలో ఉన్న అలవెన్స్ రూ. 75లను రూ. 150లకు పెంచుతూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టీసీలో పల్లె వెలుగుతో పాటు ఇతర సర్వీసుల్లో పనిచేసే డ్రైవర్, కండక్టర్స్‌లు ప్రయాణీకులను గమ్య స్థానాలకు చేర్చి అర్ధరాత్రి లాస్ట్ సమయంలో ఆ ఊళ్ళోనే ఉంటారు. తిరిగి తెల్లవారుజామున మొదటి ట్రిప్పుతో ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చుతుంటారు. ఇలా రాత్రి సమయాల్లో సైతం విధులు నిర్వహించిన డ్రైవర్, కండక్టర్స్‌కు వారికి సాధారణంగా వచ్చే వేతనంతో పాటు అర్ధరాత్రులు విధులు నిర్వహించినందుకు అదనంగా గతంలో రోజుకు రూ. 75లు ఇచ్చేవారు. ఈ విధంగా డ్రైవర్‌తో పాటు కండక్టర్స్‌కు కూడా సాధారణ వేతనంతో పాటు నైట్ అవుట్ అలవెన్స్ కూడా వచ్చేవి. ఈ క్రమంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటం, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటం జరిగింది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటంతో వారికి వచ్చే ప్రయోజనాల కంటే నష్టమే ఎక్కువగా జరుగుతోందని ఉద్యోగుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విలీన క్రమంలో రాత్రులు విధులు నిర్వహించే డ్రైవర్‌లు, కండక్టర్‌లకు వచ్చే నైట్ అవుట్ అలవెన్స్‌ను రద్దు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఉన్నంతకాలం వారికి నైట్ అవుట్ అలవెన్స్ ఊసే లేదు. పలు దఫాలుగా ఉద్యోగ సంఘాల నాయకులు తమకు నైట్ అవుట్ అలవెన్స్ ఇప్పించండి మహా ప్రభో అని మొరపెట్టుకుంటున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. పైగా ఆర్టీసీని తామేదో ఉద్ధరిస్తున్నామంటూ ఊదరకొట్టుకోవటం తప్ప వారు ఉద్యోగులకు చేసిన మేలు ఏమీ లేదని ఉద్యోగ సంఘాల నాయకుల నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఆర్టీసీకి దశ మారింది. కొత్త బస్సులు కొనటంతో పాటు ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఇటీవల ప్రభుత్వ పెద్దలను ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి నైట్ అవుట్ అలవెన్స్ తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తులు చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు రూ. 75లుగా ఉన్న నైట్ అవుట్ అలవెన్స్‌ను రూ. 150లకు పెంచుతూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

ఉమ్మడి జిల్లాలో 1500 మందికి పైగా ఉద్యోగులకు లబ్ధి

తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1500 మందికి పైగా ఆర్టీసీ డ్రైవర్స్, కండక్టర్స్‌కు లబ్ధి చేకూరనున్నట్లు చెబుతున్నారు. డిపోల వారీగా ఉమ్మడి జిల్లాలో 13 డిపోల నుంచి నైట్ అవుట్ విధులు నిర్వహించే వారికి మేలు కలగనుండటంపై డ్రైవర్, కండక్టర్స్‌లో హర్షాతిరేఖాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో నైట్ అవుట్ అలవెన్స్ ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేసిందని, కూటమి ప్రభుత్వం న్యాయం చేశారంటూ వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

యలమందలలో సీఎం చంద్రబాబు పర్యటనకు స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు



31న యలమందలలో సీఎం పర్యటన

● సభాస్థలిని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

నరసరావుపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నరసరావు పేట నియోజకవర్గంలోని యలమందలలో 31న ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను సీఎం చంద్రబాబు నాయుడు పంపిణీ చేస్తారన్న సమాచారంతో సభాస్థలిని అధికారులు గురువారం పరిశీలించారు. చంద్రబాబు నాయుడు పర్యటన తొలుత పులిపాడులో ఉంటుందని ఆ గ్రామంలో ఏర్పాట్లు చేపట్టారు. సీఎం పర్యటన యలమందలకు మారినట్టు అందిన సమాచారం మేరకు కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు గ్రామంలో చేపట్టాల్సి ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. హెలిప్యాడ్, సభావేదిక కోసం స్థలాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ సూరజ్, టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. పులిపాడు, యలమందల ఏ గ్రామంలో సీఎం టూర్ ఉంటుందో ఇంకా స్పష్టత రానట్టు అధికారులు చెబుతున్నారు. అయితే రెండు గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎంవో నుంచి సీఎం పర్యటనపై అధికారికంగా ప్రకటన వెలువడలేదు.

జెస్సీరాజ్‌కు పీఎం బాల పురస్కార్ ప్రదానం

మంగళగిరి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వీర బాలల దినోత్సవం సందర్భంగా దేశంలోని సాహస బాలలకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా జాతీయ స్థాయిలో బాల పురస్కార్ అవార్డులను ప్రదానం చేస్తుంది. సాహస కార్యాలు, క్రీడలు, సంస్కృతి, విద్య రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన బాలలకు న్యూఢిల్లీలో గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ అవార్డుల కోసం గుంటూరు జిల్లా నుంచి వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఐదుగురు బాలల దరఖాస్తు లను పరిశీలించి కలెక్టరు ఎస్ నాగలక్ష్మి కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఏపీ వ్యాప్తంగా అనేక మంది



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జెస్సీరాజ్

అర్హులైన బాలబాలికలు ఈ అత్యున్నత అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా, కేంద్రస్థాయి కమిటీ దరఖాస్తులను పరిశీలించి మంగళగిరికి చెందిన 9వ తరగతి విద్యార్థిని మాత్రపు జెస్సీరాజ్‌ను ఎంపిక చేసింది. బాలికా క్రీడల విభాగంలో ఇటీవల న్యూజిలాండ్ లో నిర్వహించిన ప్రపంచ ఆర్టిస్టిక్ స్కేటింగ్ పోటీల్లో జెస్సీరాజ్ అత్యుత్తమ ప్రతిభను కనబర్చింది. అంతర్జాతీయ స్థాయిలో ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో స్వర్ణ పతకం సాధించిందుకు గాను జెస్సీరాజ్ బాల పురస్కార్-2024 అవార్డుకు ఎం పికైంది. న్యూఢిల్లీలో గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జెస్సీరాజ్ ఈ అవా ర్డును అందుకుంది. పురస్కారం అందుకున్న జెస్సీరాజ్, తల్లిదండ్రులు ఎం సురేష్, రాధ దంపతులను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, జిల్లా అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

● సీఎం నివాసం వద్ద ఘటన



హెడ్‌కానిస్టేబుల్ రాజయ్య మృతదేహం

తాడేపల్లి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఓ హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన తాడేపల్లి పరిధిలోని ఉండవల్లి సీఎం నివాసం వద్ద గురువారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. కడప ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌కు చెందిన ఎస్.రాజయ్య (52) ఉండవల్లి చంద్రబాబు నివాసం వద్ద విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 25వ తేదీన జ్వరం రావడంతో అస్వస్థతకు గురయ్యారు. తిరిగి గురువారం విధులకు హాజరవ్వగా, ఉదయం పది గంటల సమయంలో గుండెపోటు రావడంతో సహచర సిబ్బంది ఆయన్ని మణిపాల్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా, అప్పటికే మృతిచెందారు.

30 నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

● పరేడ్ గ్రౌండ్స్‌ను పరిశీలించిన ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30 నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. అధికారులతో కలిసి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌ని గురువారం ఆయన పరిశీలించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలకు మైదానాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. దేహదారుఢ్య పరీక్షలలో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ తదితర పరీక్షల నిర్వహణ నిమిత్తం అనువుగా మైదానాన్ని తీర్చి దిద్దాలని అధికారులకు చెప్పారు. కానిస్టేబుల్ అభ్యర్థులు మైదానంలోకి ప్రవేశించినది మొదలు కుని, దేహదారుఢ్య పరీక్షలు ముగించుకుని తిరిగి వెళ్ళే వరకూ వారికి అర్థమయ్యే రీతిలో ప్రతి పరీక్ష ఘట్టాన్ని సూచించే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటుచేయాలని సూచించారు. అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు, ఛాతీ, ఎత్తు కొలతలు చూడటానికి, దేహదారుఢ్య పరీక్షలు నిర్వహణ విషయమై ఏవిధంగా విధులు నిర్వర్తించాలో తగిన సూచనలు చేశారు. పెరేడ్ గ్రౌండ్ పరిశీలనలో అదనపు ఎస్పీలు జీవీ రమణమూర్తి, కే సుప్రజ, ఏ హనుమంతు, అద్దంకి వెంకటేశ్వరరావు, ఎస్బీ డీఎస్పీ సీతారామయ్య ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.



పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌ని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, అదనపు ఎస్పీలు సుప్రజ, రమణమూర్తి తదితరులు

సమీకృత వ్యవసాయ విధానానికి మొగ్గు చూపాలి

● రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు ఢిల్లీరావు

లాంఫాం(తాడికొండ), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెంది నిలదొక్కుకోవడానికి వారు సమీకృత వ్యవసాయ విధానం వైపు మొగ్గు చూపాలని రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు ఢిల్లీరావు తెలిపారు. గురువారం లాంఫాంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ కృషి విజ్ఞానకేంద్రంలో అమలుచేస్తున్న వివిధ రకాల వ్యవసాయ, పశు సంపద, అనుబంధ పరిశోధనల ప్రదర్శన క్షేత్రాలు, క్షేత్రసాయిలో రైతులకు మరింత అవగాహన కోసం దోహదపడతాయన్నారు. కేవీకేల్లో పుట్టగొక్కుల పెంపకం, వాణిజ్యస్థాయిలో వానపాముల ఎరువు తయారుచేసే విధానం, పందుల పెంపకంపై శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. కోళ్ళు, చేపల పెంపకంలో మేలైన నూతన యాజమాన్య పద్ధతులను సూచించే విధంగా ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా పరిశోధనలు చేసి వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చాలన్నారు. రాష్ట్రంలోని వివిధ కేవీకేలలో కన్నా లాం కేవీకే క్షేత్రం మాత్ర మే పశుసంవర్ధక, పశు అనుబంధ పరిశోధనలను క్షేత్ర స్థాయిలో ప్రదర్శనా క్షేత్రాలను సందర్శిం చుకునే అవకాశం కల్పిస్తుందన్నారు. రబీ సీజన్‌లో శనగ విత్తే విధానాన్ని పరిశీ లించారు. అధిక దిగుబడులను ఇచ్చే నేపియర్ గడ్డి జాతి విత్తన కట్టింగ్స్‌ను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త యుగంధర్, కేవీకే శాస్త్రవేత్త గంగాదేవి, గుంటూరు జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



నేపియర్ గడ్డిని రైతులకు పంపిణీ చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు ఢిల్లీరావు

వందేళ్లుగా పేదల పక్షాన సీపీఐ

● రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు
● దాచేపల్లిలో ఘనంగా శతాబ్ది ఉత్సవాలు



దాచేపల్లిలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల ర్యాలీలో పాల్గొన్న ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు

దాచేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) వందేళ్లుగా పేదల పక్షాన నిలబడి, వారి హక్కుల కోసం పోరాడుతూనే ఉందని వంద సంవత్సరాలు నిలబడిన ఏకైక పార్టీ సీపీఐ అని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. గురువారం దాచేపల్లి నగర పంచాయతీలోని మందపాటి నాగిరెడ్డి కల్యాణ మండ పంలో సీపీఐ శత వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాలకు అండగా వుంది కమ్యూనిస్టు పార్టీ ఒక్కటేనని అన్నారు. పేదల కూడు, గూడు, గుడ్డ, గౌరవప్రదమైన జీవనం కోసం కమ్యూనిస్టు పార్టీ జెండా చేతపట్టి ఎంతో మంది ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేశారన్నారు. ఆక్రమంలో ప్రాణాలను సైతం అర్పించారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిందన్నారు. వెట్టిచాకిరి, దొరలు, జమిందారుల దోపిడీ, దుర్మార్గాలను ప్రతిఘటించిందన్నా రు. 4,500మంది కమ్యూనిస్టులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేడు కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్నాయని, వారి ప్రయోజనాల కోసం దేశాన్ని, రాష్ట్రాన్ని పణంగా పెడుతున్నాయని ఆరోపించారు. ఈ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలంతా ఐక్య ఉద్యమాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. పల్నాడు ప్రాంతంలో మాజీ ఎమ్మెల్యే మందపాటి నాగిరెడ్డి నాయకత్వంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కోసం, నడికూడి-బీబీనగర్ రైలు మార్గం కోసం సీపీఐ ఉద్యమాలు చేపట్టిందన్న విషయాన్ని గుర్తుచేశారు. తొలుత దాచేపల్లిలోని కోలా సత్యానారాయణరెడ్డి భవనం నుంచి మందపాటి నాగిరెడ్డి కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాలలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, మాచర్ల నియోజకవర్గ కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి, నేతలు కొమెర వెంకటరావు, గుడవల్లి నాగేశ్వరరావు, తెలనాకుల సత్యానారాయణ, బుర్రి కృష్ణారెడ్డి, డాక్టర్ బుర్రి రంగారెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఎన్టీయూ రాష్ట్ర నాయకులు లింగిరెడ్డి వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పీఏని.. ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం

● నిందితుడిపై పట్టాభిపురం స్టేషన్‌లో కేసు నమోదు

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'నేను పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి పీఏను, అంతేగాక మాధవి నాకు అక్క అవుతుంది. ఆమెతో చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తాను' అంటూ మోసగించిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు తురకపాలెం రోడ్డులోని భాగ్యనగర్ మూడో లైన్‌కి చెందిన గోరంట్ల మాలకొండయ్య ఇంటి వద్ద గతంలో షేక్ మహమ్మద్ ఆరిఫ్ అద్దెకు ఉండేవాడు. ఆ విధంగా ఆరిఫ్‌కు మాలకొండయ్యకు మధ్య పరిచయం ఏర్పడింది. కొద్ది నెలల క్రితం ఆరిఫ్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని, ఆమె తల్లి వద్ద రూ.18 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం రాకపోవడంతో డబ్బులు అడగ్గా ఆర్నెల్లు సమయం అడిగాడు. ఉద్యోగం రాలేదు కదా, డబ్బులు ఇవ్వమని బాధితులు అడగడంతో వారిని చంపుతానని బెదిరించాడు. దీంతో బాధితుడు మరింత లోతుగా విచారించగా మరికొంతమంది దగ్గర కూడా ఉద్యోగాల పేరుతో మాలకొండయ్య ఇలాగే డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. దీంతో బాధితుడు పట్టాభిపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్దెకారు తనఖా పెట్టి మోసం

ఇదిలా ఉంటే నిందితుడు గోరంట్ల మాలకొండయ్యపై మరో చీటింగ్ కేసు నమోదు అయింది. పోలీసుల కథనం మేరకు.. తుఫాన్‌నగర్ ఒకటో లైనుకు చెందిన షేక్ ఖాసిం సైదా ఒక కన్సల్టెన్సీలో పని చేస్తుంటాడు. అయితే నిందితుడు గోరంట్ల మాలకొండయ్య అలియాస్ టెంపర్ తనకు అత్యవసరంగా డబ్బులు కావాలని, తన కారును తనఖా పెట్టుకొని డబ్బులు ఇవ్వాలని అడిగాడు. ఖాసిం సైదా లక్షన్నర ఇచ్చి కారును పెట్టుకున్నాడు. ఆ తరువాత తేజ అనే వ్యక్తి వచ్చి ఆ కారు తనదనీ, మాలకొండయ్య అద్దెకు తీసుకున్నాడని చెప్పి కారును తీసుకెళ్లాడు. దీంతో మోసపోయానని తెలుసుకున్న షేక్ ఖాసిం సైదా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు మరో చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖాతా నుంచి నగదు మాయం

స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని స్తంభాలగరువుకు చెందిన ఉస్మాన్ సయ్యద్ అమెజాన్‌లో ఒక ఆర్డర్ పెట్టాడు. అది నచ్చక రిటర్న్ చేసేందుకుగానూ గూగుల్లో హెల్ప్ లైన్ నంబర్ సెర్చ్ చేశాడు. ఈ క్రమంలో గూగుల్ లో పేర్కొన్న నంబరుకు ఫోన్ చేయగా వారు చెప్పినట్లు చేశాడు. అలా చేయడంతో ఆయన ఖాతా నుంచి విడతల వారీగా సుమారు రూ. 30 వేలు కట్ అయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల వ్యాపారి పరారి ?

మాచర్లటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ఎరువుల వ్యాపారి అప్పులు చేసి పరారైనట్లు సమాచారం. సుదీర్ఘకాలంగా పట్టణంలో నివాసముంటూ ఎరువుల వ్యాపారం చేస్తున్న వ్యక్తి తన బంధువులు, స్నేహితుల వద్ద నుంచి సుమారు రూ. 2 కోట్లు దాకా అప్పులు చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యాపారి ప్రముఖ దేవాలయ సేవా కమిటీలో కీలక పదవిలో కొనసాగుతున్నారు. అయితే తనకున్న స్థిరాస్తులను ఇటీవల విక్రయించుకొని సొమ్ము కూడబెట్టుకున్నట్లు సమాచారం. కాగా అప్పులిచ్చిన వారు అతని కోసం వెతుకులాట ప్రారంభించారు. ఇటీవల పట్టణంలో ప్రైవేటు చిట్టీల వ్యాపారం చేసే ఓ వ్యక్తి కూడా పెద్ద మొత్తంలో అప్పులు చేసి పరారయ్యాడు. అలాగే ఓ మహిళ కూడా తనకున్న అప్పులకు సంబంధించి పలువురికి నోటీసులు జారీ చేసింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111,119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

53,545 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 49,089 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 53,545 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 47,637 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14000
నెంబరు. 5	9500	12000
273	-	-
341	9000	14000
4884	11500	11500
సూపర్ 10	8500	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	13500
బ్యాడిగి	7500	13000
దేవనూరు డీలక్స్	10000	14000
తెల్లకాయలు	4000	10500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	7500	13500
నెంబరు.5	8000	11500
273	8000	11500
341	10000	13000
4884	10500	10500
సూపర్ 10	--	--
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	16500
బ్యాడిగి	10000	13800
దేవనూరు డీలక్స్	10000	13500
తెల్లకాయలు	4000	9500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

గృహం కోల్పోయిన వారికి ఆర్థిక సాయం

రేపల్లె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊలుపాలెం గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో గృహం కోల్పోయిన దోనేపూడి మోహన్‌రావుకు అల్లంశెట్టి నరేష్‌రావు రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కట్టుబట్టలతో బయటకు వచ్చిన మోహన్ రావు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునేలా కృషిచేస్తానని హామీనిచ్చారు.

శ్మశానవాటిక అభివృద్ధికి విరాళం

అమృతలూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి దాత విరాళం అందించారు. గ్రామానికి చెందిన బొల్లు శుభగీత జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు లక్షా 75 వేల రూపాయలను అభివృద్ధి కమిటీకి గురువారం అందజేశారు. ఈ నగదును శుభగీత భర్త వెంకటసూర్యనారాయణ, కుమార్తె ఘట్టమనేని ప్రవీణ చేతుల మీదగా కమిటీకి అందించారు. కార్యక్రమంలో ఘైనేని రత్నప్రసాద్, వెలువోలు రాజగోపాలరావు, క్రొత్తపల్లి భాస్కరరావు, వెలగపూడి జానకిరామయ్య, రావర్ల వెంకటసూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల సవరణకు అవకాశం

అమృతలూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత సోషల్ ఆడిట్‌లో ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలను మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో అందుబాటులో ఉన్నట్లు తహసీల్దార్ నెహ్రూబాబు గురువారం తెలిపారు. వీటిలో ఏవైనా సవరణలు ఉంటే జనవరి 6వ తేదీలోగా అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. సవరణలు చేసి లబ్ధిదారులకు అందిస్తామన్నారు.

30న కమలాత్మిక హోమం, లక్ష్మీపూజ

బాపట్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చీలురోడ్డు సెంటర్‌లోని పాండురంగాస్వామి దేవాలయ ప్రాంగణంలో ఈ నెల 30న కమలాత్మిక హోమం, లక్ష్మీపూజ నిర్వహిస్తున్నట్లు లలిత త్రిపురసుందరి పీఠం నిర్వాహకులు, పండితులు నెమలికంటి హనుమంతరావు తెలిపారు. ఈ విషయమై గురువారం ఆయన మాట్లాడుతూ దశమహా విద్యాస్వరూపాలలో లక్ష్మీదేవియాగ స్వరూపం కమలాత్మికదేవి అమ్మవారు అన్నారు. మార్గశిర బహుళ అమావాస్య నాడు ప్రభాతవేళ కమలం నుంచి ఉద్భవించిన మహాపుణ్యదినంన కమలాత్మికదేవిని పూజిస్తే భక్తులకు సంపూర్ణ ఆయురారోగ్యాలను అనుగ్రహిస్తుందన్నారు. పూజా కార్యక్రమంలో భక్తజనం అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. హోమంలో పాల్గొనేవారు 9701489906లో సంప్రదించాలన్నారు.

హోరాహోరీగా ఎడ్ల పోటీలు

బాపట్ల రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం నరసాయపాలెం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూత్, ఎడ్లబండ్ల యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం నాటు, మైసూర్ ఎడ్లజతల పోల్‌రథ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ ఎడ్లజత పోటీల్లో మొదటి స్థానంలో బాపట్ల జిల్లాకు చెందిన విజయలక్ష్మి ఎడ్లజత నిలవగా రూ. 15,116 మొదటి బహుమతిగా అందజేశారు. రెండో స్థానంలో కృష్ణాజిల్లా ఎడ్లజతకు 10,116లు, మూడో స్థానంలో నిలిచిన కొత్తపాలెం మోపిదేవి మండలంకు చెందిన ఎడ్లజతకు 7,116 నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో నరసాయపాలెం గ్రామ సర్పంచి హైమావతి, మాజీ సర్పంచి గట్టుపల్లి ఇజ్రాయిల్, మార్పు నాగేశ్వరరావు, వీరయ్య, దేవరపల్లి శరత్ చంద్ర, రమేష్, వేముల వినోద్ పాల్గొన్నారు.

క్రైమ్ జోన్

ద్విచక్రవాహనం చెట్టును ఢీకొని వ్యక్తి మృతి

బాపట్ల రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం వేగంగా చెట్టును ఢీకొనటంతో తీవ్ర గాయాలపాలై వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పెదగొల్లపాలెం మండలంకు చెందిన రాజు తన ద్విచక్ర వాహనంపై బాపట్ల మండలం కంకటపాలెం గ్రామానికి వెళ్లి, బాపట్ల వైపునకు తిరిగి వస్తూ తన ద్విచక్రవాహనాన్ని వేగంగా చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలయ్యాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోసగించి పెళ్లి చేసుకున్న వ్యక్తి అరెస్టు

కొల్లూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళను మోసగించి పెళ్లి చేసుకున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఏడుకొండలు గురువారం తెలిపారు. కృష్ణా జిల్లా నాగాయలంక మండలం గణపేశ్వరంకు చెందిన మేడేపల్లి వెంకటేశ్వరరావు అలియాస్ పృధ్వీరాజ్ చౌదరిని బుధవారం కొల్లూరు బస్టాండ్ సెంటర్ వద్ద అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ముద్దాయిని తెనాలి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

కారు ప్రమాదంలో బాలికకు తీవ్రగాయాలు

చెరుకుపల్లి, డిసెంబరు 26: చెరుకుపల్లిలోని షానీగషాపింగ్‌మాల్ దగ్గర కారు ముందు టైరు పేలటంతో డివైడర్‌ను ఢీకొంది. గురువారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన మేడం రాజు తన కుటుంబ సభ్యులతో మోపిదేవి ఆలయంలో దైవదర్శనం చేసుకుని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 8 ఏళ్ల రాజు కుమార్తె మేడం శ్రీనిత తీవ్రంగా గాయపడింది. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో గుంటూరు తరలించారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

రేపల్లె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల భూ హక్కుల సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండలంలోని రాజుకాల్వ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని కొంతమంది రైతులు అడంగల్‌ల్లో తప్పులు పడ్డాయనీ, రికార్డుల ప్రకారం చూసుకుంటే భూమి తక్కువ చూపెడుతుందనీ, ఆక్వా రొయ్యల చెరువుల సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. వీటన్నింటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.



రాజుకాల్వలో అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు



చదలవాడ గ్రామంలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

వేమూరు మండలంలో..

వేమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తమ భూములకు చెందిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించి సహకరించాలని చదలవాడ గ్రామ రైతులు రెవెన్యూ అధికారులను కోరారు. గురువారం నిర్వహించిన గ్రామసభలో 15 మంది రైతులు అర్జీలు సమర్పించారు. తాతల నాటి నుంచి రికార్డులలో పేర్లు మారలేదనీ, అలాగే సర్వే నిమిత్తం పెట్టుకున్న దరఖాస్తులకు స్పందన లేకుండా పోయిందని అధికారుల ముందు వాపోయారు. గ్రామసభల ద్వారా పెట్టుకున్న అర్జీలకు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ రైతులు ఇచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసి వాటిని తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచి రమేష్ బాబు, ఆర్ఐ సాయి, వీఆర్వో శివ, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షాన నిరంతర పోరాటం

● ఘనంగా సీపీఐ శత వసంతోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ నాయకులు శ్రీధర్

బాపట్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు నిరంతరం పోరాటం చేస్తామని సీపీఐ సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్ స్పష్టం చేశారు. పట్టణంలోని శృంగారపురం సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా సమితి ఆధ్వర్యంలో సీపీఐ శత వసంతోత్సవాలను గురువారం జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ అనేక సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేసిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ముత్తిరెడ్డి నాగేశ్వరరావు, ఆట్ల పోలిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించి 100 సంవత్సరాలు కావడంతో ఆ పార్టీ నాయకులు స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు గొట్టిముక్కల బాలాజీ, బండారు శ్రీనివాసరావు మాట్లాడుతూ అమరులైన కమ్యూనిస్టుల పోరాటాలు, త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో ప్రజా సమస్యలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు పోరుబాట సాగించాలని పిలుపునిచ్చారు. 1925 డిసెంబరు 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ కార్మిక, కర్షక, పేద ప్రజల కోసం ఎన్నో త్యాగాలు చేసిందన్నారు. పోరాటాల ద్వారా లక్షలాది మంది పేదలకు సాగుభూములు, నివేశన స్థలాలు పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీదేనన్నారు. కార్యక్రమంలో వి.శ్రీనివాసరావు, నాగరాజు, ధార్నిక్ తదితరులు పాల్గొన్నారు.



అరుణ పతకాన్ని ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

ప్రజలు మెచ్చిన నాయకుడు వంగవీటి మోహనరంగా

బాపట్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పార్టీలు, కుల, మతాలకు అతీతంగా సేవలందించి ప్రజలు మెచ్చిన నాయకుడిగా వంగవీటి మోహన రంగా నిలిచారని సైనిక సంక్షేమ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు పేర్కొన్నారు. పట్టణంలోని భీమావారిపాలెంలో వంగవీటి విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కాపు సేవా సంఘం నాయకులతో కలిసి ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో కాపు సేవా సంఘం అధ్యక్షులు ఇక్కుర్తి శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాది భీమా లీలాకృష్ణ, నాయకులు అలపర్తి శ్రీనివాసరావు, కొటికలపూడి సురేష్, రాయుడు, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, భీమా వెంకటేశ్వరరావు, అంజినేష్, సురేంద్ర, తోట కృష్ణ పాల్గొన్నారు.



భీమావారిపాలెంలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న సాంబశివరావు, శ్రీనివాసరావు

వైసీపీ ఆధ్వర్యంలో..

వైసీపీ ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగాకు ఘన నివాళులర్పించారు. వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య అనుచరులతో కలిసి భీమావారిపాలెంలోని రంగా విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చల్లా శ్రీనివాసరావు, భోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆకురాతి విష్ణుమూర్తి, కత్తుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపల్లెలో...

రేపల్లె, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధికి దివంగత వంగవీటి మోహనరంగా ఎంతో కృషి చేశారని కూటమి నాయకులు దామెర్ల రమేష్ అన్నారు. గురువారం రంగా వర్ధంతి సందర్భంగా పాతపట్నంలో రంగా విగ్రహానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూటమి నాయకులు పూషడపు నాని, డి.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, ఉపేంద్ర, రాఘవయ్య, రవితేజ, మల్లికార్జునప్రసాద్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూచినపూడిలో..

నిజాంపట్నం మండలం కూచినపూడిలో వంగవీటి మోహన్‌రంగా విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొలసాని వెంకటేశ్వరరావు, తోట వెంకటరామారావు, గాదె శ్రీనివాసరావు, నల్లపాటి యల్లయ్య, రామారావు, ఎ.పున్నారావు, శ్రీను, టి.రమేష్, ఎ.తాతారావు తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నంలో నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు

కర్లపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం మండలం యాజలి గ్రామంలో వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా జనసేన పార్టీ బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ కాపు సేవా సంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చుండూరులో...

చుండూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా నిలిచిన వ్యక్తి వంగవీటి మోహనరంగా అని జనసేన మండల అధ్యక్షుడు, మున్నంగివారిపాలెం సర్పంచి అమ్మిశెట్టి శ్రీరామమూర్తి పేర్కొన్నారు. గురువారం చుండూరులో రంగా వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన సీనియర్ నాయకుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు రంగా ఆనాడు పేదలకు చేసిన సేవలను వివరించారు. గ్రామంలో పేదలకు అన్నదానం, దుప్పట్లు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు తోట నాగరాజు, సోదా శ్రీను, రామకృష్ణ, మైలా శివయ్య నాయుడు, ఇక్కుర్తి రిషికేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో...

నగరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వంగవీటి మోహన్‌రంగా వర్ధంతి సందర్భంగా నగరం ప్రధాన కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగం రంగా, స్థానికులు పాల్గొన్నారు.


మార్కెట్ కమిటీ రిజర్వేషన్లు ఖరారు

వేమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి పండగకు మార్కెట్ కమిటీల నియామకం చేపడతామని ప్రకటించడంతో బాపట్ల జిల్లా కలెక్టర్ జిల్లాలోని ఎనిమిది మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లను ప్రకటించారు. సెక్షన్ 5, 1996 మార్కెట్ చట్టం, యాక్టు 28కి అనుగుణంగా సంబంధిత రిజర్వేషన్ల వివరాలను వెల్లడించారు. దీని ఆధారంగా వేమూరు మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఓసీ మహిళకు దక్కనుంది. ఈ పదవి కాలపరిమితి రెండేళ్లు మాత్రమే. కమిటీలో మొత్తం సభ్యులు 20 మంది ఉంటారు. వారిలో 12 మంది రైతులు, ముగ్గురు లైసెన్స్ ట్రేడర్లు ఉండాలి. ఐదుగురు ఎక్స్ అఫీషియల్ సభ్యులుగా ఉంటారు. వారిలో స్థానిక ఎమ్మెల్యే, స్థానిక పంచాయతీ సర్పంచి, పీఏసీఎస్ అధ్యక్షుడు, జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ అధికారి, పశుసంవర్ధక శాఖ లేక వ్యవసాయ శాఖ ఏడీ, హార్టికల్చరల్, ఫిషరీస్ విభాగాల్లో ఎవరో ఒకరు ఉండాలి. 12 మంది సభ్యులు రైతులై ఉండాలి. వారిలోనే చైర్మన్ నియామకం జరుగుతుంది. ముగ్గురు ట్రేడర్స్‌లో గానీ, రైతుల నుంచి గానీ వైస్ చైర్మన్ ఎన్నుకుంటారు. 15 మందిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు తప్పనిసరిగా ఉండాలి. చిన్న, సన్నకారు రైతులు ఐదుగురు ఉండాలి.

రిజర్వేషన్ల వివరాలు...

జీవో నంబరు 77 ప్రకారం 15 మంది సభ్యుల నియామకానికి రిజర్వేషన్లు వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్, మహిళా విభాగంలో 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి. 15 మందికి రూల్ ఆఫ్ రిజర్వేషన్ తూచా తప్పక పాటించాల్సి ఉంది. దీని ఆధారంగా వేమూరు మార్కెట్ కమిటీకి మహిళా సభ్యులు సంఖ్య ఎనిమిది మందికి తగ్గకుండా నియమించాల్సి ఉంది. 50 శాతంలో ఓసీ కేటగిరీలో 8 మంది సభ్యులు ఉండాలి. వారిలో నలుగురు పురుషులు, నలుగురు మహిళలు ఉండాలి. 29 శాతం బీసీ కేటగిరిలో నలుగురు ఉండాలి. వారిలో ఇద్దరు మగ, ఇద్దరు ఆడవారు ఉండాలి. 15 శాతం ఎస్సీ కేటగిరీలో ఇద్దరు ఉండాలి. వారిలో మగ, ఆడవారు ఉండాలి. ఆరు శాతం ఎస్టి కేటగిరీలో ఒక మహిళను తప్పనిసరిగా నియమించాల్సి ఉంది.

పాఠశాల పనితీరు అస్తవ్యస్తం



కర్లపాలెం హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో శ్రీరామ్ పురుషోత్తం

కర్లపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పనితీరు అస్తవ్యస్తంగా ఉందని బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ పురుషోత్తం అన్నారు. కర్లపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయునితో సహా 9 మంది ఉపాధ్యాయులు ఉండగా, ప్రధానోపాధ్యాయుడు, ముగ్గురు ఉపాధ్యాయులు గైర్హాజరవ్వడంపై డీఈవో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకేసారి నలుగురు ఉపాధ్యాయులు సెలవు పెట్టడంపై విస్మయం వ్యక్తం చేశారు. పాఠశాలలో కేవలం 56 శాతం హాజరు ఉండటంతో ఉపాధ్యాయుల పనితీరు అస్తవ్యస్తంగా ఉందని మండిపడ్డారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు ఆశించిన స్థాయిలో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో తరగతి గదులను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. 10వ తరగతి 100 రోజుల ప్రణాళిక అమలుపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల పనితీరు మార్చుకోకపోతే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేలవాలిన వరిపంట



మద్దిబోయన వారిపాలెంలో నేలవాలిన వరి

బాపట్ల రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకుతోడు ఈదురు గాలులు వీస్తుండటంతో బాపట్ల మండలంలో కోతకు వచ్చిన వరి పంట పొలాలు చాలా వరకు నేలకు ఒరిగాయి. మరో 10, 15 రోజుల్లో కోత కోయాలి అనుకున్న సమయంలో వరి నేలవాలటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కాస్త తెరిపిస్తే పడిపోయిన వరిపనలను దుబ్బులుగా కట్టుకోవచ్చునని ఆలోచనలో ఉన్నారు. కొన్నిచోట్ల వరికోతలు కోసి వరిపనలు పంట పొలం మీదే ఉన్నాయి. వర్షపు నీటిలో నానుతున్నాయి. బాపట్ల మండలంలో ఇప్పటి వరకు కేవలం 50శాతం వరకే వరికోతలు కోశారు. పంట పొలాల్లో ఉన్న వరి ఈ వాయుగుండం ప్రభావం వలన చాలా వరకు నేలకొరిగింది. బాపట్ల మండలం నందిరాజుతోట, అప్పికట్ల, చుండూరుపల్లి, ఈతేరు, భర్తీపూడి, నరసాయపాలెం, జమ్ములపాలెం గ్రామాల్లోని రైతులు తమ వరిపంటను వరిమెషిన్‌ల ద్వారా కోసి ధాన్యాన్ని రోడ్లమీద అరబోశారు. గత మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో రోడ్ల మీద ఆరబోసిన ధాన్యాన్ని కూలీల ద్వారా బస్తాలకు ఎక్కించి రైస్ మిల్లులకు తక్కువ ధరకే విక్రయించుకుంటున్నారు. నేలవాలిన వరిపంటకు నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే యూబీఐ లక్ష్యం



చెక్కును అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ మాధురి

కర్లపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధి, మహిళా సంఘాల జీవనోపాధి పెంపుదలే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన లక్ష్యమని రీజనల్ హెడ్ టి.మాధురి అన్నారు. కర్లపాలెంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో డ్వాక్రా గ్రూపులకు జీవనోపాధి రుణాల నిమిత్తం యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన రుణమేళా కార్యక్రమంలో మాధురి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి మహిళ లక్షాధికారి కావాలనే సంకల్పంతో బ్యాంకల ద్వారా అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంఘానికి రూ. 20లక్షలతోపాటు మహిళా ఎంటర్ ప్రెన్యూర్ కింద లక్ష రూపాయలకు తక్కువ ఆదాయం ఉన్న మహిళకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిపాదనలతో ల్యాక్‌పతి దిదిగా గుర్తించి వ్యాపార సేవ ఉత్పత్తి రంగాలకు రూ. లక్ష నుంచి రూ. 10 లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి బ్యాంక్ మేనేజర్ కేసాని మానసా అధ్యక్షత వహించారు. రూ. 5 కోట్ల చెక్కును, కోటి రూపాయల ల్యాక్‌పతి దిది చెక్కులను మహిళలకు మాధురి అందజేశారు. యూనియన్ బ్యాంక్ కార్‌లోన్ మేళాలో భాగంగా ఖాతాదారునికి కారు తాళం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీఎం శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ బ్రాంచ్ మేనేజర్ భానుఫణీంద్ర, ఆర్డీవో మనోజ్, సిబ్బంది అనిషా, సుష్మా, జగదీష్, రాజమోహన్‌రెడ్డి, గోపి, జనకమహరాజ్ పాల్గొన్నారు.

వాహనచోదకులకు హెల్మెట్ రక్షణ కవచం

● ఎస్పీ తుషార్ డూడి



బాపట్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ రక్షణ కవచంలాంటిదని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా ప్రజలకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తూ పోలీసు అధికారులు చేపట్టిన అవగాహన కార్యక్రమాలను ఉద్దేశించి మాట్లాడుతూ ఐఎస్ఐ మార్క్ ఉన్న నాణ్యమైన హెల్మెట్‌లను వాహనచోదకులు వినియోగించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినపుడు ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారిని హెల్మెట్ ఏవిధంగా రక్షిస్తుందో తెలుసుకోవాలన్నారు. హెల్మెట్ ధరించకపోతే ఏవిధంగా జరుగుతుందో ప్రజలకు అర్థమయ్యేరీతిలో పోలీసులు వివరించాలన్నారు. ప్రమాదాలు కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేస్తాయన్నారు. పోలీసుల జరిమానాలకు భయపడి చాలా మంది హెల్మెట్‌లు కొంటున్నా, వాటిని వినియోగించటంలో శ్రద్ధ చూపటంలేదన్నారు. వెంట తెచ్చుకొని పోలీసులు కనిపిస్తే ధరించటం, లేదంటే బండి హ్యాండిల్‌కు తగిలించుకోవటం సరికాదన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కువగా తలకు గాయాలౌతాయన్నారు. తద్వారా మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనం నడపాలని ఎస్పీ కోరారు. ఎస్పీ పిలుపు మేరకు రూరల్ ఎస్సై శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల దగ్గర గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి ర్యాలీ నిర్వహించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

చుండూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితురాలికి వైద్య ఆరోగ్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.7 లక్షల చెక్కును గుంటూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గురువారం బాధితురాలికి అందించారు. మండలంలోని చినపరిమికి చెందిన కట్టుపల్లి రజని కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధ పడుతుంది. గ్రామస్తులు, నాయకులు ఎమ్మెల్యే ఆనందబాబుకి సమాచారం తెలపడంతో వెంటనే బాధితురాలు చికిత్సకి అవసరమైన రూ.7 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందే విధంగా చర్యలు తీసుకుని గురువారం ఆ చెక్కును బాధితురాలికి అందించారు.

వైద్య ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీపీ



పెదపులివర్రు పీహెచ్‌సీలో రిజిస్టర్ పరిశీలిస్తున్న ఎంపీపీ లలితకుమారి

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఎంపీపీ లలితకుమారి ఆకస్మిక తనిఖీ చేశారు. గురువారం మండల పరిధిలోని పెదపులివర్రు పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లో ఆమె రికార్డులను పరిశీలించారు. పాఠశాల విద్యార్థులకు సంబంధించిన ఐరన్, అల్‌బెండజోల్ మందులను పరిశీలించారు. ప్రతి గురువారం క్రమం తప్పకుండా విద్యార్థులకు అందించాల్సిన మందులతోపాటు రక్త నమూనాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

కోస్టల్ బ్యాంకు ఆధ్వర్యంలో వైద్య శిబిరం

కొల్లూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోస్టల్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఖాతాదారులను గురువారం వైద్యులు పరీక్షించారు. కోస్టల్ బ్యాంకు స్థాపించి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా రజతోత్సవాలు పురస్కరించుకుని కార్పొరేట్ ఆఫీసు ఆదేశాల మేరకు కొల్లూరులోని కోస్టల్ బ్యాంకులో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు గౌతమరాజ్, సిబ్బంది బ్యాంకుకు వచ్చిన సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందించారు. బ్రాంచ్ మేనేజర్ మోహన్ మణిధర్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుంచి కోస్టల్ బ్యాంకు ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని చూరగొని దినదినాభివృద్ధి చెందిందన్నారు. ఖాతాదారులకు నాణ్యమైన సేవలను అందించడంలో బ్యాంకు సిబ్బంది ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులు ప్రభుత్వ నియమాలను పాటించాలి



కల్లుగీత సంఘం నాయకులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్

నగరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులు ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలని, కల్తీలేని స్వేచ్ఛమైన కల్లును అమ్మాలని, కేంద్ర ప్రభుత్వం అందించే లేబర్ బీమాను అందరూ తీసుకోవాలని నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ మాటూరి శ్రీరామ్‌ప్రసాద్ అన్నారు. గురువారం నగరంలోని స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలోని నిజాంపట్నం, నగరం, చెరుకుపల్లి మండలాల కల్లు గీతకార్మికుల సహకార సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లుగీత వృత్తి చాలా ప్రమాదకరమైనదని, తగు జాగ్రత్తలు తీసుకుంటూ వృత్తిని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అనగాని ఆంజనేయులు, కామినేని సురేష్, జయరామ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల కార్యాచరణ ప్రణాళిక



మాట్లాడుతున్న మెప్మా సీఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం

బాపట్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి స్వయం సహాయక సంఘాన్ని ఏగ్రేడ్‌లో ఉంచేందుకు జీవనోపాధుల జాతర 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను చేపట్టినట్లు మెప్మా సీఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ విషయమై గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆర్పీలతో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘాలలోని సభ్యులు, కుటుంబ సభ్యులకు సూక్ష్మ,చిన్న, మధ్య తరహా ఎంటర్ ప్రైజస్ ద్వారా రూ. 50వేలు నుంచి రూ. 50 లక్షల వరకు రుణాలు అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఆర్పీలు వారి పరిధిలోని స్వయం సహాయక సంఘాల్లో దరఖాస్తుదారులను గుర్తించి పేర్లను ఆన్‌లైన్ చేయించాలన్నారు. మెప్మా ద్వారా దరఖాస్తు చేసుకుంటే వారికి ఉపాధి అవకాశం కల్పించి తలసరి ఆదాయం పెంచటానికి కృషి చేస్తామన్నారు. అలాగే హోమ్ ట్రైయాంగిల్ కార్యక్రమం ద్వారా పబ్లిక్ యాప్ తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ యాప్‌లో రిక్వెస్ట్ పెట్టుకున్న వారికి అవసరమైన ఎలక్ట్రికల్, కార్పెంటర్, ఎలక్ట్రానిక్, ప్లంబింగ్ వచ్చి సేవలందిస్తారని తెలిపారు. సమావేశంలో సీవోలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సమాచారాన్ని సమగ్రంగా ఉంచుకోవాలి

● జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావు

పిట్టలవానిపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ గ్రామ పంచాయతీల యాప్‌ల సమాచారాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు సమగ్రంగా ఉంచుకోవాలని బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావు అన్నారు. మండలంలోని చందోలు గ్రామ పంచాయతీలోని సచివాలయం-1ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యదర్శులు స్వర్ణ గ్రామ పంచాయతీల యాప్‌లపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఇంటి పన్నులు వసూలు వేగవంతం చేయాలన్నారు. ప్రతి ఒక్క గ్రామ పంచాయతీలో తడి, పొడి చెత్త షెడ్‌లపై దృష్టి సారించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీలోని సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు సహకరించుకొని గ్రామాల అభివృద్ధికి బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎ.ఎలీషాబాబు, చందోలు, అల్లూరు, పిట్టలవానిపాలెం, కొత్తపాలెం, జీఎన్‌పాలెం, అలకాపురం, పోతనకట్టువారిపాలెం, ఖాజీపాలెం, పిట్టువారిపాలెం, కోమలి, కోడూరు గ్రామ పంచాయతీలకు సంబంధించిన కార్యదర్శులు పాల్గొన్నారు.

స్కామర్ల పంజా!

- ఆందోళనకర స్థాయిలో స్పామ్ మోసాలు
- కొత్తకొత్త పద్ధతుల్లో అక్రమాలకు పాల్పడుతున్న వైనం
- ట్రాయ్‌పేరుతో బెదిరింపు కాల్స్.. ఐవీఆర్ఎస్ ఆప్షన్లతో హ్యాకింగ్
- కొరియర్, ఈ- కామర్స్ సంస్థల పేరుతో టోకరా
- డెలివరీ మిస్సింగ్ అని మెసేజ్‌లు.. లేఖలు
- వివరాల కోసమంటూ క్యూఆర్ కోడ్లు.. స్కాన్ చేస్తే ఇక అంతే!
- యూపీఐ ద్వారా నగదు పంపి కొత్త పద్ధతిలో దోపిడీ
- సాక్షాత్తు హోమ్ శాఖే రంగంలోకి దిగి సంరక్షణ చర్యలు





స్కామర్లు ఇళ్ల దగ్గర పడేసిన లెటర్.. ఇన్‌సెట్లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయమంటున్న దృశ్యం

గుంటూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాలు అంతకంతకూ పెరిగిపోతూనే ఉన్నాయి. వాటిని కట్టడి చేయడానికి ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం చేస్తున్న ప్రయత్నాలకు సవాలు విసురుతూ కొత్త కొత్త పద్ధతుల్లో స్కామర్లు సామాన్య ప్రజలపై విరుచుకుపడుతున్నారు. పాత పద్ధతులపై అవగాహన కల్పిస్తూ వస్తున్న అధికార యంత్రాంగానికి, ఆ ప్రక్రియ పూర్తి కాకముందే కొత్త అవతారమెత్తి స్కామర్ జనం సొమ్ము దోచుకుపోతున్నాడు. ఒకప్పుడు ఓటీపీలతో దోచుకున్న స్కామర్ ఇప్పుడు వాటితో కూడా పనిలేని అధునాతన పద్ధతుల్లో బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసే కొత్త పద్ధతుల్లో చెలరేగిపోతున్నాడు. రోజుకో అవతారమెత్తుతున్న ఆన్‌లైన్ మోసగాళ్లను చూసి సామాన్యుడు బెంబేలెత్తిపోతున్నాడు. ఏ రూపంలో ఆన్‌లైన్ మోసగాడు తమపై వల విసురుతాడో.. తమ నగదును ఎలా కాజేస్తాడో తెలియక సతమతమవుతున్నాడు.

క్యూ ఆర్ కోడ్‌తో దోపిడీ..

ఇటీవల ఒక ఇంటి డోర్ వద్ద ఒక లేఖ కనిపించింది. ఆ లేఖలో ఆ ఇంటివారు ఆర్డర్ చేసిన ప్రొడక్ట్ డెలివరీ మిస్ అయిందని, ఒక కొరియర్ సంస్థ పేరుతో ఆ లేఖ వచ్చింది. ఆ లేఖలో వే బిల్ నెంబరు, తేదీ మాత్రమే ఇచ్చి సారీ ఉయ్ మిస్ యూ.. అని ఉంటుంది. ప్రొడక్ట్ వివరాలు, మిస్సింగ్ కారణాలు తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి అని మెసేజ్ ఉంది. ఆ ఇంట్లోవారు ఎవరూ ఏమీ ఆర్డర్ చేయకపోవడంతో వారు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయలేదు. స్థానికంగా ఉన్న పోలీసులను సంప్రదించగా అది ఆన్‌లైన్ మోసగాళ్ల పని అని నిర్ధారించారు. ఆ లేఖలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఉంటే వారి యూపీఐ ఖాతా హ్యాక్ అయిపోతుంది. మోసగాళ్లకు యాక్సెస్ లభిస్తుందని, అలా జరిగితే వారి ఖాతా మొత్తాన్ని మోసగాళ్లు కాజేస్తారని తెలియజేశారు.

యూపీఐ ద్వారా నగదు పంపి..

యూపీఐ ద్వారా నగదు పంపి వారి యూపీఐ అకౌంట్‌ను హ్యాక్ చేస్తారు. దీనికోసం 'జంప్డ్' అనే కొత్తటెక్నిక్‌ను వినియోగిస్తున్నారు. మొదట ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం లేదా ఏ ఇతర యూపీఐ మొబైల్ యాప్ ద్వారా స్కామర్లు మన బ్యాంకు ఖాతాకు నగదు పంపుతారు. దీంతో మన బ్యాంకు ఖాతాలో నగదు డిపాజిట్ అయినట్లు మెసేజ్ వస్తుంది. మెసేజ్ రాగానే ఆ నగదు ఎలా వచ్చింది? ఎవరు పంపారురు బ్యాలెన్స్ పెరిగిందా? అని తెలుసుకోవాలన్న కారణంగా ఎవరైనా యూపీఐ యాప్‌లో చెక్ చేసుకుంటారు. అదే స్కామర్లకు అవకాశం. స్కామర్ నగదు పంపిన వెంటనే విత్‌డ్రా చేసుకునేందుకు రిక్వెస్ట్ సిద్ధం చేస్తాడు. ఎప్పుడైతే యూపీఐ యాప్‌లో పిన్ నెంబర్‌ను ఎంటర్ చేస్తారో.. అప్పుడు స్కామర్‌కు నగదు విత్‌డ్రా చేసుకునేందుకు యాక్సెస్ వస్తుంది. అంతే ఇక బ్యాంకు ఖాతా మొత్తం కాళీ అయిపోతుంది. అందువల్ల ఇలా నగదు పడిన వెంటనే యూపీఐలో చెక్‌చేసుకోవద్దని నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ చెక్ చేసుకోవాల్సి వస్తే అవతలి వ్యక్తి మనకు నగదు పంపినట్లు ఫోన్ చేసి తెలియజేస్తేనే చెక్ చేసుకోవాలని చెబుతున్నారు. లేదు విధిలేని పరిస్థితిలో చెక్ చేసుకోవాలని పిస్తే తొలుత తప్పుగా పిన్ ఎంటర్ చేయాలి. అప్పుడు స్కామర్ రిక్వెస్ట్ రెజెక్ట్ అవుతుంది. ఆ తరువాత ఒరిజినల్ పిన్‌తో బ్యాలెన్స్ చెక్ చేసుకోవచ్చు అని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఫైల్స్ పంపించి దోపిడీ..

మొబైల్ యాప్‌లకు అనేక రూపాల్లో స్కామర్లు ఫైల్స్ పంపుతున్నారు. స్మార్ట్ ఫోన్ వినియోగదారులు తమ మొబైల్స్‌లో రకరకాల అప్లికేషన్లను డౌన్లోడ్ చేసుకుంటుంటారు. దాన్ని ఆసరా చేసుకుని అనేక అప్లికేషన్ ఫైళ్లను స్కామర్లు మన మొబైల్ ఫోన్లకు పంపిస్తారు. వాటిని డౌన్లోడ్ చేసుకునేందుకు క్లిక్ చేసుకుంటే నష్టం తప్పదు. వాటి ద్వారా మన సమాచారం మొత్తం స్కామర్ల చేతికి వెళ్లిపోతుంది. బ్యాంకు ఖాతాలు హ్యాక్ అవుతాయి. సామాన్యులకు అత్యంత అవసరమైన పథకాలు, బ్యాంకులు, ఆధార్ పేర్లతో ఆ ఫైల్స్‌ను పంపుతున్నారు. ఉదాహరణకు ఆధార్. ఏపీకే, ఎస్‌బీఐ. ఏపీకే, పీఎం కిసాన్. ఏపీకే, యూనియన్ బ్యాంక్. ఏపీకే పేరుతో పంపిస్తారు. ఇలా 'డాట్ ఏపీకే' అనే పేరుతో వచ్చే ఫైల్స్‌ను ముట్టుకుంటే ఫోన్ హ్యాక్ అయిపోయినట్లే లెక్క. కాబట్టి ఇలాంటి ఫైల్స్‌ను ఎవరూ టచ్ చేయవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఐవీఆర్ కాల్ రూపంలో..

ఇప్పటి వరకూ వెలుగు చూసిన దోపిడీల్లో ఇది అతి పెద్ద దోపిడీ. మీరు ఫోన్ నెంబరును దుర్వినియోగం చేస్తున్నారు. అందువల్ల మీ నెంబరును మరో 2 గంటల్లో బ్లాక్ చేస్తున్నాం. దాన్ని ఆపాలంటే 1 నొక్కండి! వివరాలు తెలుసుకోవడానికి 9 నొక్కండి! పూర్తి సమాచారం కావాలంటే 2 నొక్కండి! అంటూ ట్రాయ్ పేరుతో ఐవీఆర్ఎస్ విధానంలో బ్యాంకుకు లింకై ఉన్న ఫోన్ నెంబర్లకు కాల్స్ వస్తాయి. ఆ ఆప్షన్ల ప్రకారం ఏ నెంబరు నొక్కినా ఇక అంతే సంగతులు. దాని ద్వారా మొబైల్ హ్యాక్ అయిపోతుంది. అందులోని మనీ యాప్‌లు స్కామర్ల చేతికి వెళ్లిపోతాయి. తాము ఈడీ, సీబీఐ, కస్టమ్స్, ఇన్‌కమ్ టాక్స్ పోలీస్ అధికారులమని చెప్పి భయపెట్టి విచారణ కోసమంటూ బ్యాంకు ఖాతాల వివరాలను తీసుకుని ఖాతా ఖాళీ చేస్తారు. ట్రూ కాలర్లో కూడా ఆయా సంస్థల పేర్లు పడడంతో ఆందోళన చెంది అందరూ ఆ నెంబర్లు నొక్కుతారు. మోసపోతారు. అలాంటి కాల్స్ ఏవి వచ్చినా ఫోన్లు ఎత్తవద్దని ట్రాయ్ హెచ్చరిస్తోంది. గతంలో ఇండియా కోడ్ +91తో కాకుండా ఇతర విదేశాల కోడ్లతో కాల్స్ వచ్చేవి. ఆ కారణంగా కొద్దోగొప్పో చదువుకున్నవారు, అవగాహన వున్నవారు కోడ్‌ను పసిగట్టి జాగ్రత్త పడేవారు. ఇప్పుడు +91 కోడ్‌తోనే కాల్స్ వస్తున్నాయి. గుర్తించడం కష్టం. అందువల్ల కాల్ లిఫ్ట్ చేసినా వాళ్లు చెప్పే ఇతర నెంబర్లు మాత్రం నొక్కవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

> ● మంగళగిరిలో ఒకరికి ట్రాయ్ పేరుతో కాల్ వచ్చింది. మీ నెంబరు దుర్వినియోగం చేశారు. దాన్ని మరో రెండు గంటల్లో రద్దు చేస్తాం.. ఆపాలంటే 9 నొక్కండి. వివరాలు తెలుసుకోవాలంటే 2 నొక్కండి అంటూ చెబుతోంది. ఆ కాల్ వెనుక ఏదో మోసం ఉందని గ్రహించి సదరు వినియోగదారు కాల్ కట్ చేసి ఫిర్యాదు చేశారు.

> ● మంగళగిరిలోలో ఒకరి ఇంటి వద్ద లెటర్ బాక్స్‌లో ఒక కవర్ కనిపించింది. అందులో మీ ఆర్డర్ మిస్ అయినందుకు చింతిస్తున్నాం. ఆర్డర్‌ను పంపించాలంటే కింద వున్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి అని ఉంది. అతడు ఏమీ ఆర్డర్ చేయకపోవడంతో అందులో ఏదో మోసం ఉందని దాన్ని చించేశాడు. కాగా ఇటీవల కర్ణాటకకు చెందిన ఒక బడా వ్యాపారి ఇలా నెంబర్లు నొక్కిన కారణంగా అతడి ఖాతా నుంచి రూ. 11 కోట్లు నష్టపోయాడు. దీంతో కేంద్ర హోమ్ శాఖే రంగంలోకి దిగాల్సి వచ్చింది.

> ● ఇలాంటి స్కాముల బారిన పడి ఈ ఏడాది సెప్టెంబరులో పెదకాకాని స్టేషన్ పరిధిలో ఒకరు రూ. 91 లక్షలు, పట్టాభిపురం స్టేషన్ పరిధిలో ఒకరు రూ. 1.27 కోట్లు కోల్పోగా, అక్టోబరులో పట్టాభిపురం స్టేషన్ పరిధిలో ఒకరు రూ. 1.03 కోట్లు, పాతగుంటూరు స్టేషన్ పరిధిలో ఒకరు రూ. 1.25 కోట్లు నష్టపోయినట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి.

హోమ్‌శాఖ నుంచి హెచ్చరికలు

ఇటీవల ట్రాయ్ అధికారి పేరుతో వచ్చిన ఒక ఫేక్ కాల్ కారణంగా బెంగళూరుకు చెందిన విజయ్ కుమార్ అనే వ్యక్తి 11 కోట్ల 83లక్షల రూపాయలు కాజేశారు. మీ మీద మనీ ల్యాండరింగ్ కేసు నమోదయింది. మీ అకౌంట్‌ను డిజిటల్ లాక్ చేస్తున్నామని చెప్పి అతడి ఖాతాను హ్యాక్ చేశారు. విచారణ కోసం బ్యాంకు ఖాతా వివరాలు చెప్పాలని డిమాండ్ చేశారు. అతడు వివరాలు ఇవ్వడంతో అతడి ఖాతా నుంచి రూ. 11.83 కోట్లు కాజేశారు. ఇదంతా మోసమని తాను గ్రహించే సరికే ఆ నష్టం జరిగిపోయింది. దీంతో అతడు పోలీసులను ఆశ్రయించాడు. సంచలనం సృష్టించిన ఈ విషయం తర్వాత హోమ్ శాఖ అప్రమత్తమయింది. ఇప్పుడు ప్రతి కాల్‌కు ముందు హెచ్చరికలు జారీ చేస్తోంది. ఈడీ, కస్టమ్స్, జడ్జిలు, పోలీసుల పేరుతో ఎవరు కాల్ చేసినా ఆందోళన చెందవద్దని, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని హెచ్చరిస్తోంది. దాంతోపాటు నేషనల్ పోలీస్ హెల్ప్‌లైన్ 112, నేషనల్ విమెన్ హెల్ప్‌లైన్ 181 నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవం

- శ్రేణులకు రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ దిశానిర్దేశం



ర్యాలీలో పాల్గొన్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శత వార్షికోత్సవం గుంటూరులో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ స్టేడియం నుంచి గాంధీపార్కు వరకు సీపీఐ శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి. అనంతరం గాంధీపార్కు వద్ద గురువారం జరిగిన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో సీపీఐ రాష్ట్రకార్యదర్శి కే రామకృష్ణ ప్రసంగిస్తూ రాజ్యాంగాన్ని పరిరక్షిం చడాకి, లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణకు, సమసమాజ స్థాపనకు త్యాగాలు, పోరాటాలకు సమాయత్తం కావాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్రం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమ కార్యచరణ రూపొం దిస్తున్నామన్నారు. స్వాతంత్ర పోరాటంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. సీపీఐ పోరాటాల ఫలితంగానే భూ సంస్కరణ చట్టం అమల్లోకి వచ్చిందని గుర్తుచేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి మనువాదాన్ని అమలుచేసే కుట్ర జరుగుతుందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగురి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ లక్షల కోట్ల సంపద కేవలం కొద్దిమంది చేతుల్లోనే ఉండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే సవాళ్లను మరింత దీటుగా ఎదుర్కోవడానికి శత వార్షికోత్సవాలు వేదిక కావాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు సీపీఐ సీనియర్ నాయకులను ఘనంగా సన్మానించారు. సభకు సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షత వహించగా, సమావేశంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ, సీపీఐ నాయకులు మేడా హనుమంతరావు, రావుల అంజిబాబు, వలీ, నాసర్‌జీ, అకిటీ అరుణ్‌కుమార్, సురేష్, చల్లా చిన ఆంజనేయులు, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలలకు చేరిన మందులు

- రూ.43 లక్షల అత్యవసర ఔషధాల పంపిణీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు సిటీ, డిసెం బరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పశువైద్యశాలలకు రూ.43 లక్షల విలువ చేసే మందులను సరఫరా చేసినట్లు జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ నర సింహారావు తెలిపారు. 'పడకేసిన పశు వైద్యం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురి తమైన కథనానికి ఆయన స్పందిం చారు. జిల్లాలోని పశు వైద్యశాలల్లో అవసరమైన మందులను పంపిణీ చేశామని తెలిపారు. జిల్లా పశు వైద్యశాల (పాలీ క్లినిక్)తో పాటు, 9 తాలూకా స్థాయి పశు వైద్యశాలలు, 45 వెటర్నరీ డిస్పెన్సరీలు, 39 గ్రామీణ పశువైద్య శాలలకు ఈ మందులను పంపామన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి పశువులకు అవసరమైన మందులను వినియోగిం చుకోవాలని సూచించారు

నిధులున్నా.. నిరుపయోగం

(5వ పేజీ తరువాయి)

యార్డులో నిర్మించారు. అయితే బీసీ కాలనీ కూడా యార్డుకు పక్కనే ఉంటుంది. అటు పూలే కాలనీ కూడా యార్డుకు దగ్గర్లో ఉంటుంది. విజయవాడ రోడ్డు, సుల్తానాబాద్ వంటి శివారుల్లో ఎక్కడా ఒక్క స్టేషన్ ఏర్పాటుకు కూడా మున్సిపాలిటీ ఆలోచనే చెయ్యలేదు. కేంద్రం నిధులిస్తోంది... నిర్మాణం చేపట్టమన్నారు కనుక ఎక్కడో ఒక చోట నిర్మించేస్తే పనయిపోతుందన్నట్టు పూర్తి నిర్లక్ష్యాన్ని తెనాలి మున్సిపల్ అధికారులు ప్రదర్శించారు. రూ.2.16 కోట్లతో చెత్త సమస్యకు చరమగీతం పాడే అవకాశం ఉన్నా, అధికారుల ముందుచూపులేమితో ఇక్కడి లక్ష్యాన్ని నీరుగార్చింది. పోనీ ఉపయోగమో.. నిరుపయోగమో వారు తల పెట్టిన చోటయినా నిర్మించారా అంటే అదీలేదు. కంపోస్ట్ యార్డులో ఒక గదికోసం శ్లాబ్ వేసి వదిలేశారు. మిగిలిన రెండు చోట్ల అయితే పునాదుల దశలోనే ఆగిపోయి నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నాయి. అటు గుంటూరు నగరంలోనూ పలుచోట్ల నిర్మించేందుకు రూ.223 కోట్లు, మిగిలిన నరసరావుపేట, మంగళగిరి, తాడేపల్లి, బాపట్ల, పొన్నూరు, చీరాల, అద్దంకి, మాచర్ల, పిడుగురాళ్ల, వినుకొండ, దాచేపల్లి, గురజాల, సత్తెనపల్లి వంటి మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోనూ వీటి నిర్మాణం కోసం మొత్తంమీద మరో రూ.30.6 కోట్లు కేటాయించారు. అయితే ఒకటి, రెండుచోట్ల మినహా మిగిలిన చోట్ల ఎక్కడా పనులు చివరి దశకు చేరలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అసలు వీటిని పట్టించుకున్న నాథుడే లేడంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికే అన్ని మున్సిపాలిటీల్లో కంపోస్ట్ యార్డులన్నీ చెత్తతో నిండిపోయాయి. కొన్నిచోట్లయితే చెత్త గుట్టలు కొండలను తలపిస్తున్నాయి.

బయో మైనింగ్ విధానంలో పరిష్కారం దిశగా

గత ప్రభుత్వ నిర్లక్ష్యం ఇప్పుడు పట్టణాలకు శాపమయింది. పేరుకుపోయిన చెత్త గుట్టలను తొలగించటానికి, చెత్త సమస్యను అధిగమించటం కూటమి ప్రభుత్వానికి భారమే అవుతోంది. అప్పట్లో చెత్త నిధులను సద్వినియోగ పరుచుకుంటే, ఇప్పుడు అంత ఖర్చు చెయ్యాల్సిన అవసరం ఉండేది కాదు. 2025 అక్టోబరుకు చెత్త గుట్టలే ఉండకూడదని నిర్ణయించుకుంది. దీని కోసం బయో మైనింగ్ విధానం ప్రవేశపెట్టింది. దీనిద్వారా చెత్త గుట్టలను గ్రేడింగ్ చేసి, మట్టిని జల్లించి కంపోస్ట్ చేయదలిస్తే, ప్రమాదకర వ్యర్థాలను మాత్రం ఆధునిక విధానంలో నిర్వీర్యం చేస్తారు. దీనికోసం రాష్ట్రం మొత్తంమీద భారీ వ్యయమే అవుతోంది. ఒక్క తెనాలి మున్సిపాలిటీలోని చెత్తను బయో మైనింగ్ విధానంలో తొలగించటానికి రూ.3.17కోట్లు ఖర్చవుతుంది. దీని ప్రకారం చూస్తే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మున్సిపాలిటీలన్నింటిలో రూ. 100 కోట్ల పైనే ఖర్చవుతుంది. గతంలో వచ్చిన నిధులను వినియోగించుకుంటే ఇప్పుడు ఇంత భారం పడేది కాదు. మొత్తం మీద గత ప్రభుత్వ నిర్వాకంతో పట్టణాల్లో పేరుకున్న చెత్తను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం ఒక యజ్ఞాన్నే చేపట్టినట్టయింది.

వినూత్నంగా.. వరి

- తక్కువ పెట్టుబడి.. అధిక లాభాలు
- ఎకరాకు 48 నుంచి 50 బస్తాల దిగుబడి
- ఆదర్శంగా నిలుస్తోన్న రావిచెట్టుపాలెం రైతులు
- నిన్న ఆర్ఎన్ఆర్ 15048.. నేడు కేఎన్ఎం 733 సాగు



రైతులు పండిస్తున్న 733 కె.ఎన్.ఎం రకం వరి పంట

వినుకొండటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరి సాగు అంటే నష్టం.. దిగుబడి కష్టం.. అని రైతులు భావిస్తున్నారు. అయితే వినూత్నంగా వరి సాగు చేస్తూ.. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు మండలంలోని గోనుగుంట్లవారిపాలెం(రావిచెట్టుపాలెం) రైతులు. కొత్త కొత్త వంగడాలను సాగు చేస్తూ లాభాల బాటలో పయనిస్తున్నారు. ఏడేళ్లుగా నూతన వంగడాలను తెచ్చి సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. సమీపంలోని వాగు నీటి సాయంతో కొత్త రకం వరి వంగడాలను పరిచయం చేస్తూ ఎకరాకు 45 నుంచి 50 బస్తాలు వడ్లు దిగుబడి సాధిస్తున్నారు. వేసిన పంట వేయకురా ఆ పంటను పాడు చేయకురా అనే సిద్ధాంతాన్ని అమలు చేస్తున్నారు. రైతే రాజు అనే నానుడితో లాభాల బాటలో సేద్యం చేస్తున్నారు. 120 రోజుల వ్యవధి గల వరి వంగడాలను సాగు చేస్తున్నారు. తెలంగాణలోని జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ అభివృద్ధి చేసిన 733 కేఎన్ఎం రకానికి చెందిన కోనారం అతి సన్నాలను గ్రామస్తులంతా ఈ సారి సాగు చేశారు. నెల్లూరులోని సింహపురి ఆగ్రో ఇన్ ఫుడ్స్ నుంచి 500 ఎకరాలకు బస్తా రూ.1150 చొప్పున 500 బస్తాల వంగడాలను తెప్పించి ఆగస్టు 20న నాట్లు వేశారు. ఏవిధమైన తెగుళ్లు సోకలేదు. ఆశించిన మేరకు దుబ్బు కట్టడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వరి దండగని.. పెట్టుబడి కూడా రాదనే భావనలో మండల పరిధిలోని పలు గ్రామాల రైతులు క్రాప్ హాలిడే ప్రకటించి పొలాలను బీళ్లు పెట్టారు. కానీ ఈ గ్రామానికి చెందిన రైతులు మొక్కవోని నమ్మకంతో వరి సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందుతున్నారు. గతంలో నంద్యాల నుంచి ఆర్ఎన్ఆర్ 15048 రకానికి చెందిన వంగడాలను దిగుమతి చేసుకున్నారు. రైతులంతా ఐక్యంగా సుమారు 500 ఎకరాల మేరకు పంటలు పండించారు. ఎవరూ ఊహించని విధంగా ఎకరానికి 48 నుంచి 50 బస్తాల వరకు దిగుబడి సాధించారు. షుగర్ లెస్ (తెలంగాణ సోనా) పేరుతో బస్తా ఒకటికి రూ.2200 డిమాండ్‌గా విక్రయించి లాభాలు సాధించారు.

పెట్టుబడులకు ఇబ్బందులు



మా గ్రామంలో నూతన వరివంగడాలు పండిస్తున్నాం. నేను ఈ ఏడాది 15 ఎకరాలు సాగు చేస్తున్నాను. సాగుకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉంటే లాభం. వడ్డీకి తెచ్చి పంటలు పండిస్తే పెట్టుబడి కూడా రాని పరిస్థితి. ప్రభుత్వం నిబంధనలు లేకుండా బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తే రైతులకు లాభసాటిగా ఉంటుంది.

- మల్లాది పుల్లారావు

దళారి వ్యవస్థతో నష్టం



రైతు ఇంటికి వచ్చి పంటలను కొనుగోలు చెయ్యాలి. ప్రధానంగా దళారి వ్యవస్థతో రైతులు ఆర్థికంగా నష్ట పోతున్నారు. ఎగుమతి, దిగుమతి కూలీలు భరించలేక పోతున్నారు. ప్రభుత్వం ఎప్పుడైతే నేరుగా రైతుల నుంచి పంటను కొనుగోలు చేస్తుందో అప్పుడే రైతులకు సాగుపై ఆదాయం వస్తుంది.

- నాగెండ్ల హనుమంతరావు

గోశాలల నిర్మాణంలో అలసత్వం

- పీఆర్ జాయింట్ కమిషనర్ సునీత

గుంటూరు సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో ప్రారంభించిన గోశాలల నిర్మాణంలో అలసత్వం వహిస్తున్నారని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్ జాయింట్ కమిషనర్ సునీత అన్నారు. గురువారం గుంటూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ అధికారులు, ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయి అధికారులు అలసత్వం వీడి యుద్ధ ప్రాతిపదికన పల్లె పండుగ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జనవరి 10కి పల్లెపండుగ పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ శంకర్, పీఆర్ ఎస్ఈ బ్రహ్మయ్య, ఏపీడీ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 31నే పింఛన్ల పంపిణీ

గుంటూరు సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌దారులకు జనవరి నెలకు సంబంధించిన పింఛన్ ఒకరోజు ముందే అంటే ఈ నెల 31 అందనున్నది. జనవరి 1న ఇవ్వాల్సిన పెన్షన్‌ను ముందే పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లుచేస్తోంది. ఎంపీడీవోలు ఈ నెల 30న పెన్షన్ సొమ్మును బ్యాంకు నుంచి డ్రా చేసి సచివాలయ సిబ్బందికి అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ నెల 31నే పెన్షన్ పంపిణీని డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి ధ్రువీకరించారు.

రేపు చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు

- యేల్చూరి, బాలకృష్ణ పోటాపోటీ ప్రచారం

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు శనివారం జరగనున్న నేపథ్యంలో ప్రచారం ఊపందుకుంది. చాంబర్ అధ్యక్ష బరిలో నిలిచిన మాజీ కార్పొరేటర్ యేల్చూరి వెంకటేశ్వర్లు, చాంబర్ మాజీ కార్యదర్శి రంగా బాలకృష్ణ ఇద్దరూ పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో అభ్యర్థులిద్దరూ ఇప్పటికే పలువురు వ్యాపారులు, సన్నిహితులతో ప్రత్యేకంగా ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. గురువారం యేల్చూరి వెంకటేశ్వర్లు తన ప్యానల్ సభ్యులతో కలిసి గుంటూరు నగర పరిధిలోని లాలాపేట ఏలూరుబజారు, పట్నంబజారు, బండ్లబజారు, వాసవీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. వ్యాపారులను కలిసి తమ ప్యానల్ సభ్యులకు ఓటు వేసి గెలిపించాలని తెలిపారు. వ్యాపారులకు అన్ని వేళలా అండగా నిలుస్తానని యేల్చూరి వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వెచ్చా కృష్ణమూర్తి, టీఎల్‌వీ వీరాంజనేయులు, నాగేశ్వరరావు, రామిరెడ్డి, సదా శివయ్య తదితరులున్నారు. ఇక అధ్యక్ష బరిలో నిలిచిన రంగా బాలకృష్ణ తన ప్యానెల్ సభ్యులతో కలిసి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే పలువురు వ్యాపారులను కలిసిన ఆయన గురువారం ఏలూరుబజారు, బండ్లబజారు, కొత్తపేట ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. వ్యాపారుల సమస్యలను పరిష్కరించటలంతో పాటు అన్ని వేళలా అండగా నిలుస్తానని బాలకృష్ణ కోరారు. 28న ఎన్నికల్లో ఓటు వేసి తన ప్యానల్‌ను గెలిపించాలని కోరారు.



ఎన్నికల ప్రచారంలో యేల్చూరి వెంకటేశ్వర్లు, ప్యానల్ సభ్యులు



ఎన్నికల ప్రచారంలో రంగా బాలకృష్ణ ప్యానల్ సభ్యులు

కాల్వలపై.. కూటమి నేతల కన్ను

(5వ పేజీ తరువాయి)

వ్యయం అంచనా రూ.3.34కోట్లు. లింగంగుంట్ల మానిటరింగ్ డివిజన్ పరిధిలో 31 పనులు, వ్యయం అంచనా రూ. 3.65 కోట్లు. ఓఅండ్ఎం సిఫ్ట్ డివిజన్ వినుకొండ పరిధిలో 34 పనులు, వ్యయం అంచనా రూ. 1.78 కోట్లు. ఈ పనులు చేపట్టేందుకు జలవనరుల శాఖ ఏర్పాట్లుచేస్తోంది. పనుల నిర్వహణకు టెండర్లను జలవనరుల శాఖ అధికారులు నిర్వహిచారు.

మూడు డివిజన్‌లలో టెండర్లు రద్దు

సత్తెనపల్లి, నరసరావుపేట లింగంగుంట్ల ఓఅండ్ఎం, వినుకొండ సిఫ్ట్ డివిజన్‌ల పరిధిలోని కాలువల మరమ్మతు పనులకు సంబంధించిన టెండర్లు రద్దు చేశారు. మాచర్ల ఓఅండ్ఎం డివిజన్‌లో రూ. 4.69 కోట్ల వ్యయంతో 101 పనులు, లింగంగుంట్ల మానిటరింగ్ డివిజన్ పరిధిలో రూ.3.65కోట్ల వ్యయంతో 31 పనులకు సంబంధించిన టెండర్లు నిర్వహించారు. కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్‌లు కూడా పూర్తి చేశారు. పనులు నిర్వహిస్తున్నారు. సత్తెనపల్లి డివిజన్‌లో రూ. 3.34 కోట్ల వ్యయంతో 62 పనులు.. వినుకొండ పరిధిలో రూ. 1.78 కోట్ల వ్యయంతో 34 పనులు, లింగంగుంట్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో రూ. 4.21 కోట్ల వ్యయంతో 76 పనులు చేపట్టేందుకు ఆయా డివిజన్‌ల వారీగా టెండర్లు నిర్వహించారు. టెండర్ల ప్రక్రియ కాంట్రాక్టర్ల అగ్రిమెంట్ సమయంతో నిలిచిపోయింది. ఈ మూడు డివిజన్‌లలో రూ. 9.33 కోట్ల విలువైన 141 పనులు నిలిచిపోయాయి. సత్తెనపల్లి డివిజన్‌లో 62 పనులకు గాను 52 పనులకు టెండర్లు నిర్వహించగా ఐదు పనులకు సంబంధించి కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్‌లు పూర్తయ్యాయి. ఈ ఐదు పనులు చేపడుతున్నారు. ఈ డివిజన్‌లో ఇంకా 57 పనులు టెండర్లు నిర్వహించాల్సి ఉంది.

టెండర్లు నిర్వహిస్తాం

కాలువల మరమ్మతు పనులు టెండర్లు రద్దు చేయడంపై సత్తెనపల్లి డివిజన్ ఈఈ మురళీధర్, వినుకొండ ఈఈ ప్రేమ్‌కుమార్, ఓఅండ్ఎం లింగంగుంట్ల ఈఈ డీవీ సుబ్బారావును వివరణ కోరగా టెండర్లు రద్దు చేశామన్నారు. పనులు చేపట్టేందుకు మళ్లీ టెండర్లు నిర్వహించనున్నట్టు చెప్పారు.

ఏఎంసీ పదవిపై ఆశావహుల దృష్టి

» బీసీ జనరల్‌కు కేటాయింపు
» రేసులో నుంచి తప్పుకున్న ఇతర వర్గాలు



చీరాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవులు పంపిణీ ఒకటికి రెండు పర్యాయాలు జరిగాయి. నియోజవర్గ పరిధిలోని నామినేటెడ్ పదవులకు సంబంధించి ఆశావహులు ఎదురు చూస్తున్నారు. అందులో చీరాల ఏఎంసీ చైర్మన్ పదవి ఒకటి. ఆ పదవి కోసం పలువురు ఆశావహులు ఎదురు చూస్తున్నారు. అయితే ఆ పదవిని బీసీ జనరల్‌కు కేటాయించారు. దీంతో మిగిలిన సామాజిక వర్గాల నుంచి ఆ పదవి కోసం ఎదురు చూస్తున్నవారు అనివార్యంగా రేసులో నుంచి తప్పుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇక బీసీల్లో ఆ పదవి కోసం పోటీ పడేవారి సంఖ్య గణనీయంగానే ఉంది. ఏఎంసీ పరిధిలో పలు రకాల విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రధానంగా వ్యసాయాధారిత ఉత్పత్తులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణతో అధికారులు, సిబ్బందితో పనులు చేయించాల్సి ఉంటుంది. రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలి. రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి గోదాముల నిర్వహణ, బ్యాంకు రుణాలు, చెస్ వసూళ్లు, లింకు రోడ్లు, వ్యవసాయ సంబంధిత వ్యాపారులు తదితర అంశాలకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలనతో సంబంధీకులకు పారదర్శకమైన సేవలు అందించేవిధంగా చర్యలు చేపట్టాలి. అలానే ఏఎంసీ ఆదాయ వనరులను గండికొట్టే పరిస్థితులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక పర్యవేక్షణతో ఉండాలి. అందుకు చైర్మన్, వైస్ చైర్మన్, ఇతర కమిటీ సభ్యులు బాధ్యతాయుతం గా వ్యవహరించాల్సి ఉంటుంది. వీటిన్నింటిని దృష్టిలో పెట్టుకొని ఏఎంసీ పాలకవర్గానికి సంబంధించి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రత్యేక కసరత్తు చేయాల్సిన అవసరం ఉందని కూటమి శ్రేణులు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాలకవర్గంలో కూటమికి సంబంధించి టీడీపీ, జనసేన, బీజేపీలకు సంబంధించిన ఆశావహులను పరిగణలోకి తీసుకుని కూర్పు చేయాల్సిన అవసరం ఉంది. చైర్మన్ పదవి బీసీ జనరల్‌కు కేటాయించడంతో వ్యవసాయ రంగానికి సంబంధించినవారు ప్రథ మ వరుసలో నిలిచే అవకాశం ఉందని చెప్తున్నారు. ఇతర రంగాలకు చెందిన ఒకరిద్దరు కూడా ఏఎంసీ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. అయితే ఎమ్మెల్యే కొండయ్య సూచించే వ్యక్తులే పాలకవర్గంగా ఉంటారని, అందుకు అందరం సమ్మతిస్తామని కూటమి శ్రేణులు చెప్తున్నాయి.

ఆ చిన్నారులు విధి వంచితులు

పరామర్శించిన డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ముండ్లమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిపాడు పంచాయతీ పరిధిలోని బంగారమ్మగుట్టలో కండరాల వ్యాధితో బాధపడుతున్న చిన్నారులను డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఎస్తేర్‌రాణి, రాఘవేంద్రరావు దంపతుల కుమారులు హర్షవర్ధన్, విజయభవాన్, విరాట్ గురించి గురువారం ఆంధ్రజ్యోతిలో 'ఆ చిన్నారులు విధి వంచితులు' శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. జిల్లా ఆరోగ్య శాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు బంగారమ్మ గుట్టలో చిన్నారులను పరామర్శించారు. అనంతరం తల్లిదండ్రులతో మాట్లాడారు. ఇది కండరాలకు సంబంధించిన వ్యాధి అని, తగ్గదని తెలిపారు. ఒకే కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ములకు వ్యాధి సోకటం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా కలెక్టర్‌తో మాట్లాడతానని చెప్పారు.



మాట్లాడుతున్న ఎంపీ ప్రసాదరావు

సొంతూరును మరువను

చిత్తూరు ఎంపీ ప్రసాదరావు

చినగంజాం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తనకు ఉజ్వల బవిష్యత్తును ప్రసాదించిన సొంతూరును ఎప్పుడూ మరువనని చిత్తూరు పార్లమెంట్ సభ్యుడు దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. మండలంలోని తన స్వగ్రామమైన చింతగుంపల్లి గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ స్ఫూర్తితో తన తల్లిదండ్రులు చూపిన బాటలో నడిచి భవితకు భరోసా అన్ననానుడికి ప్రతిరూపంగా నిలిచానన్నారు. చింతగుంపల్లి గ్రామ అభ్యున్నతికి చేయూతనందించేందుకు ఎప్పుడూ వెనకాడనన్నారు. స్వగ్రామంలోని ప్రజలందరికీ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన ఆత్మీయ సత్కార సభలో ప్రసాదరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తుందన్నారు. అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతి కోసం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. అంబేడ్కర్ కలలుగన్న సమ సమాజ స్థాపన వైపు పయనించాలంటే అందరూ ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. అపుడే రాష్ట్రంలోని దళిత కాలనీలన్నీ అభివృద్ధి వైపు నడుస్తాయన్నారు. అనంతరం ఎంపీ ప్రసాదరావుని పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. గత స్మృతులను ఆయనతో గ్రామస్థులు పంచుకున్నారు. తమ గ్రామ ప్రజలు, బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషు లు, కుటుంబసభ్యులు బాణాసంచా, మేళాతాళాలు, పుష్పాలు, కర్పూర హారతులతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యార్లగడ్డ సత్యనారాయణ, విశ్రాంత అధ్యాపకులు శ్రీరామమూర్తి, న్యాయవాది కరణం వాసుదేవరావు, ఎంపీడీవో ప్రభుదాస్, రిటైర్డ్ డీఎస్పీ కట్టా వినయ్‌కుమార్, గ్రామస్థులు జాన్సన్, రామకృష్ణ, రవిబాబు, శేఖర్‌బాబు, దానియేలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సాగునీరు అందించడమే లక్ష్యం

మార్టూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతుల పంటలకు సాగునీరు సక్రమంగా అందించడమే తమ లక్ష్యంగా పనిచేస్తామని, మీ ఆదేశాలకు, సూచనలకు అనుగుణంగా రైతు సేవ కోసమే పనిచేస్తామని నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణితో పాటు పలువురు డీసీ చైర్మన్‌లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు తెలిపారు. గురువారం మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన సాగర్ కమిటీ వైస్ చైర్మన్ చక్రపాణి, కోనంకి ఎన్ఎస్‌పి పరిధిలోని ద్రోణాదుల డీసీ చైర్మన్ కొసరాజు దిలీప్ కుమార్, ఇంకొల్లు డీసీ చైర్మన్ బండ్ల శ్రీనివాసరావు, పర్చూరు డీసీ చైర్మన్ కొల్లా మురళీకృష్ణ మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే ఏలూరిని కలిశారు. ఈ సందర్భంగా వారు ఏలూరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కోనంకి ఎన్నెస్పీ పరిధిలో సాగర్ కాలువలో రిపేరు పనులు, చిల్లచెట్లు తొలగింపు తదితర విషయాలపై ఏలూరి వారితో చర్చించారు. కార్యక్రమంలో బొల్లాపల్లి నీటి సంఘం చైర్మన్ కరణం మారుతి పాల్గొన్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి

మార్టూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇంటిలో ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చామర్తి నాగసరిత (45) గురువారం మృతిచెందినట్లు సీఐ ఎం.శేషగిరిరావు తెలిపారు. మార్టూరులో ఈ నెల 17వ తేదీన కుటుంబ సమస్యలు కారణంగా నాగసరిత ఇంట్లో సీలింగ్ ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను గుంటూరులోని ప్రవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమెకు భర్త రమేష్, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు శ్యాం దుర్గా కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు

మార్టూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో పల్లెపోగు కోటయ్య అనే వ్యక్తిపై పల్లెపోగు విజయ్ అనే వ్యక్తి స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. బుధవారం రాత్రి తమ కాలనీ క్రిస్మస్ జెండాతో ఊరేగింపుగా వెళుతుండగా కోటయ్య అనే వ్యక్తి ట్రాక్టర్‌తో తమను అడ్డగించారని విజయ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు.

తాజా వర్షాలతో దెబ్బతిన్న పంటలు

» వ్యవసాయ శాఖ అంచనా
» పలుచోట్ల అధికారుల పరిశీలన

ఒంగోలు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాజాగా కురుస్తున్న వర్షాలతో 75 గ్రామాలలో 6,481 హెక్టార్లలో పలు రకాల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఆ మేరకు జిల్లాలో వ్యవసాయశాఖ అధికారి (డీఏవో) సీహెచ్. శ్రీనివాసరావు గురువారం సాయంత్రానికి ఉన్నతాధికారులకు నివేదించారు. ఆ ప్రకారం చూస్తే దొనకొండ, పామూరు కురిచేడు, ముండ్లమూరు, ఒంగోలు, కేకేమిట్ల, టంగుటూరు మండలాల్లో వరి, మినుము, అలసంద, జొన్న, పొగాకు పంటలకు నష్టం వాటిల్లింది. మొత్తం ఏడు మండలాల్లో 75 గ్రామాలలో పంటలకు నష్టం వాటిల్లగా, అందులో అత్యధికంగా కేకేమిట్ల మండలంలోని 24 గ్రామాల్లో జరిగాయి. అలాగే మొత్తం దెబ్బతిన్న విస్తీర్ణం 6,481 హెక్టార్లలో కూడా ఆయా మండలంలోని 4,232 హెక్టార్లు ఉంది. మొత్తం జిల్లాలోని 75 గ్రామాల్లో 6,591 మంది రైతులు ఉన్నట్లు వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాలో గుర్తించింది. కాగా వివిధ ప్రాంతాల్లో వ్యవసాయశాఖ అధికారులు పంట పొలాలను పరిశీలన చేసి, ప్రస్తుత సమయంలో పంటల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు సూచనలు చేశారు. డీఎంవో శ్రీనివాసరావు టంగుటూరు మండలంలోని పంటలను పరిశీలించగా, ఇతర ప్రాంతాల్లో సంబంధిత సబ్ డివిజన్, మండల అధికారులు పరిశీలించారు.

భూప్రకంపనలతో భయాందోళన వద్దు

తాళ్లూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూప్రకంపనలతో భయాందోళన చెంద వద్దని జాతీయ జియోఫిజికల్ రిసెర్చ్ సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ డి.శశిధర్ పేర్కొన్నారు. గురువారం మండలపరిషత్ సమావేశం హాలులో ఒంగోలు ఆర్‌డీవో లక్ష్మీప్రసన్న అధ్యక్షతన భూకంపాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శశిధర్ మాట్లాడుతూ అద్దంకి సమీపాన గల గుండ్లకమ్మ పరివాహక ప్రాంతం వల్ల భూకంపాలు వస్తుంటాయన్నారు. 1967 నుంచి తరుచూ భూకంపాలు వస్తున్నా రిక్టర్ స్కేల్‌పై 3.1 మించి ఉండటం లేదన్నారు. దీనివల్ల ఎలాంటి ప్రమాదాలు సంభవించవని చెప్పారు. రిక్టర్ స్కేల్‌పై 5.5 దాటితే ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయన్నారు. ఈప్రాంతంలో తక్కువ మోతాదులో భూకంపాలు వస్తుంటాయన్నారు. దీనివల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరగవన్నారు. ఈ ప్రాంతంలో భూకంపాలు సంభవించినప్పుడు నేలలో పెద్ద శబ్దాలు మాత్రమే విన్పిస్తున్నట్లు తమ పరిశీలనలో నిర్ధారణైందన్నారు.

ఆర్‌డీవో లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ తాళ్లూరు, ముండ్లమూరు మండలాల్లో మూడు రోజుల క్రితం వరుసగా భుకంపాలు వచ్చాయన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం ప్రజలు భయాందోళన చెందకుండా ఉండేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెంద వద్దన్నారు. కార్యక్రమంలో ఏపీ విపత్తుల నిర్వహణ శాఖ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ బస్వంత్‌రెడ్డి, జాతీయ జియోఫిజికల్ రిసెర్చ్ సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ శశిధర్, డాక్టర్ సురేష్, తహసీల్దార్ కె.సంజీవరావు, డీటీ ఇమ్మానియేల్‌రాజు, తహసీల్దార్ శ్రీకాంత్, టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, కొండారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ అనూష పాల్గొన్నారు.

రంగాకు ఘన నివాళి

» కాపు జాతి ఉన్నంత వరకు రంగా పేరు పదిలం » కాంస్య విగ్రహ ప్రారంభంలో ఎమ్మెల్యే ఏలూరి



రంగా కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి, వంగవీటి రాధా



చీరాలలో నివాళులు అర్పిస్తున్న అభిమానులు

చినగంజాం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కాపు జాతి ఉన్నంత వరకు వంగవీటి మోహనరంగా పేరు చిరస్థాయిగా ఉంటుందని వంగవీటి రాధాకృష్ణ అన్నారు. మండలంలోని సోపిరాల రైల్వే గేటు సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్‌రంగా 10 అడుగుల కాంస్య విగ్రహం ఆవిష్కరణ గురువారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వంగవీటి రాధాకృష్ణ, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోపిరాల రైల్వే గేటు సెంటర్‌లో రూ.25 లక్షలతో నిర్మించిన మోహన్‌రంగా కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి, బస్ షెల్టర్‌లను ప్రారంభించారు. అనంతరం రంగా వర్థంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ కమిషనర్ డాక్టర్ టీఎస్ఆర్.ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో మోహనరంగా తనయుడు రాధాకృష్ణ మాట్లాడుతూ తన తండ్రికి మరణం లేదన్నారు. మరణించి మూడు దశాబ్దాలు అయిప్పటికీ ప్రజల మనస్సుల్లో సుస్థిరంగా ఉన్నారని అన్నారు. రంగా విగ్రహం పెట్టారంటే అందరికీ బాధ్యత పెరిగిందని అందరూ కలిసి రంగా ఆశయ సాధన దిశగా పని చేయాలన్నారు. మీ అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. రంగా విగ్రహావిష్కరణకు కృషి చేసిన ఎమ్మెల్యే ఏలూరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ రంగా అంటేనే పోరాటానికి దిక్సూచి అని, పేదల పాలిట పెన్నిధి అని అన్నారు. రంగా ఒక కులానికి సంబంధించిన వ్యక్తి కాదని అన్ని వర్గాల ప్రజల మదిలో నిలిచిరన్నారు. తనయుడిగా రాధాకృష్ణ తండ్రి ఆశయాల కోసం పని చేస్తున్నారన్నారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకున్నా సమాజం పట్ల అంకిత భావంతో పెదిగారని సమస్య ఎక్కడ ఉంటే ఆయన అక్కడ నిలిచి ప్రజలకు అండగా ఉన్నారని అన్నారు. రాధా చాలా సౌమ్యుడని, ఏది ఆశించకుండా ఆయన తండ్రి పేరు ప్రఖ్యాతలను పెంపొందించేలా రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తున్నారన్నారు. రాధాకు అద్భుతమైన భవిష్యత్ ఉందని పదిమందికి ఉపయోగపడాలంటే రాజకీయ నేపథ్యంలోనే ఉండాలన్నారు. సోపిరాల గ్రామంలో రంగా విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఎమ్మెల్యే ఏలూరిని, రాధాని సోపిరాల గ్రామ పెద్దలు సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కాపు నాయకులను ఎమ్మెల్యే ఏలూరి సన్మానించి, మెమెంటోలు అందజేశారు. డీవీ సుబ్బారావు పాడిన సత్యహరిచంద్ర పద్యాలు అందరినీ అలరింపజేశాయి. ఆయన్ని ఏలూరి సన్మానించారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా కేబీటీ కన్వీనర్ రాసరి రాము, కాపునాడు జాతీయ అధ్యక్షుడు గల్లా సుబ్రహ్మణ్యం, గాదె వెంక టేశ్వరరావు, ఆకుల తిరుమల రావు, ఉగ్గిరాల సీతారామయ్య, పొగడరండ రవికుమార్, మంత్రి శ్రీనివాసరావు, గోపాల కృష్ణ, తిరుమలశెట్టి శ్రీహరి, గొర్రెపాటి శ్రీనివాసరావు, జనసేన నేత ఆమంచి స్వాములు, రజని, టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, సోపిరాల గ్రామ పెద్దలు ఆమంచి వెంకటసుబ్బారావు, టీ.జయరావు, కే.రామసుబ్బారావులు పాల్గొన్నారు

పర్చూరు : కాపు నేత వంగవీటి మోహన్ రంగా వర్థంతి సందర్భంగా కాపు నేతలు ఘన నివాళి అర్పించారు. బొమ్మల సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలతో వేసి అభిమానం చాటుకున్నారు. పలువురు నేతలు మాట్లాడుతూ కాపుల అభ్యున్నతి కోసం రంగా ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కారంపూడి సందీప్‌తేజ, కఠారి సురేంద్రబాబు, కోటా శ్రీనివాసరావు, రంగిశెట్టి ఆంజనేయులు, దీర్ఘాల రమేష్ నాయుడు, తులసి చంటి, కంచేటి శ్రీహరి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా లింగిశెట్టి రామాంజనేయులు సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఇంకొల్లు : ఇంకొల్లులో వంగవీటి మోహన రంగా వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి పొన్నగంటి జానకిరామారావు ఆధ్వర్యంలో రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట (చీరాల) : రామ మందిరం సమీపంలోని జనసేన పార్టీ జెండా దిమ్మె వద్ద గురువారం వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ రంగా ఒక కులానికో, వర్గానికో కాకుండా అందరి కోసం, ప్రధానంగా పేదల పక్షపాతిగా పనిచేశారని కొనియాడారు. ఆనాటి పరిస్థితులు, ఘటనలను మననం చేశారు. అనంతరం చీరాల ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దాసరి రాము, తస్నీరు ప్రసాద్, మార్కండేయులు, శ్రీనివాసరావు, కిషోర్, శివరామప్రసాద్, నాగేశ్వరరావు, కిరణ్‌బాబు పాల్గొన్నారు.

శీనారెడ్డిపై విచారణ వేగవంతం

» ఫైళ్ల పరిశీలనతోపాటు ప్రస్తుత పీడీ నుంచి పలు వివరాలు సేకరించిన విచారణ కమిటీ
» ఆందోళన చెందుతున్న పలువురు ఉద్యోగులు
» సెలవు బాటలో కొందరు
» కమిటీ ముందు విచారణకు సిద్ధమవుతున్న పూర్వ పీడీ

ఒంగోలు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): డ్వామా పీడీగా శీనారెడ్డి పనిచేసిన కాలంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ నియమించిన త్రిసభ్య కమిటీ విచారణలో వేగం పెంచింది. కమిటీకి నేతృత్వం వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు బృందం పలు అంశాలను లోతుగా పరిశీలన చేస్తున్నారు. దాదాపు నాలుగైదు రోజులు పలు విభాగాలకు చెందిన ఫైళ్ల పరిశీలన చేసిన కమిటీ రెండురోజుల క్రితం ప్రధాన ఫిర్యాదుదారు అయిన డీసీసీబీ మాజీ చైర్మన్ ఈదర మోహన్‌ను పిలిచి పలు అంశాలపై స్పష్టత తీసుకొంది. అదే సమయంలో కలెక్టర్ తాజాగా అందిన మరి కొన్ని ఫిర్యాదులు పరిశీలనకి తీసుకున్నారు. తొలుత తమకు ఇచ్చిన విచారణ అంశాలపై ఫైళ్లను కోరిన వారు తాజాగా కలెక్టర్ నుంచి వచ్చిన అంశాలకు సంబంధించిన ఫైళ్లపై దృష్టిసారించారు. గురువారం సాయంత్రం డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణలు ప్రస్తుత డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌ను కలిసి పలు అంశాలపై మాట్లాడారు. ఇప్పటివరకు చేసిన విచారణలో తాము గుర్తించిన అంశాలు, వాటిపై తమకు ఉన్న సందేహాలు కొందరు ఉద్యోగుల భాగస్వామ్యం తదితర అంశాలపై పీడీతో మాట్లాడిన వారు మరికొన్ని ఫైళ్లను కూడా చూడాల్సిన అవసరం ఉందని చెప్పినట్లు సమాచారం.

ట్యాంపరింగ్‌కూ అవకాశం

మరోవైపు విచారణ ఎదుర్కొంటున్న శీనారెడ్డి వారంక్రితం కార్యాలయానికి వెళ్లి తనకు సన్నిహితులుగా ఉండే ఉద్యోగుల నుంచి కొన్ని ఫైళ్ల నకళ్లను తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రికార్డులు ట్యాంపరింగ్‌కు కూడా అవకాశం ఉంటుందని, నకళ్లు ఇచ్చిన ఉద్యోగులు వాటిని కూడా మార్పులు, చేర్పులు చేసే అవకాశాలను విచారణ కమిటీ అధికారులు పీడీ వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. అయితే తొలుత అందిన ఫిర్యాదులకు సంబంధించిన ఫైళ్ల విషయంలో ఆయా విభాగాల వారికి రాతపూర్వకంగా పలు సూచనలు, హెచ్చరికలు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను ఈ సందర్భంగా పీడీ వారికి వివరించగా తాజాగా అందిన ఫిర్యాదులకు సంబంధించిన ఫైళ్ల విషయంలోను అలాంటి చర్యలు తీసుకోవాలని వారు కోరినట్లు తెలిసింది. కాగా వచ్చే నెల 2న తమ కమిటీ ముందు హాజరై తగు వివరణ ఇవ్వాలని కమిటీనోటీసు ఇచ్చిన నేపథ్యంలో అందుకు విచారణను ఎదుర్కొంటున్న శీనారెడ్డి సన్నద్ధం అవుతున్నారు. అందుకు అవసరమైన కొన్ని ఫైళ్ల నకళ్లను గురువారం డ్వామా కార్యాలయానికి వచ్చి తీసుకెళ్లారు.

సెలవు బాటలో పలువురు

గతంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి తన సన్నిహితులైన ఉద్యోగుల నుంచి కొన్ని తీసుకెళ్లిన శీనారెడ్డి ఆ వ్యవహారంపై ప్రస్తుత పీడీ జోసఫ్‌కుమార్, విచారణ కమిటీ అధికారులు ఉద్యోగులపై సీరియస్ కావడంతోపాటు షోకాజ్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఈసారి ప్రస్తుత పీడీని కలిసి మాట్లాడి నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా గతంలో శీనారెడ్డితో అంటకాగి అప్పుడు జరిగిన అక్రమాలలో భాగస్వాములైన ఉద్యోగులు ప్రస్తుతం విచారణ జరుగుతున్న తీరుతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమపైకి రాకుండా వివిధ మార్గాలలో ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. ఈక్రమంలో కొందరు ఉద్యోగులు సెలవు బాటలో ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో కొందరు ఉద్యోగులు సెలవులో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే సెలవుపెట్టినా అవసరమైన సమయంలో సంబంధిత ఫైళ్లను చూసేందుకు రావాలనే సంకేతాలను అధికారుల కమిటీ, పీడీలు ఇవ్వడంతో మరింత ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది.

వైసీపీ పాలనలో విద్యుత్ చార్జీల పెంపు

దర్శి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ఐదేళ్ళ పాలనలో అడ్డగోలుగా అనేకసార్లు విద్యత్ చార్జీలు పెంచిన విషయాన్ని మరచి ఇప్పుడు తగ్గించాలని నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వటం శోచనీయమని దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్ చైర్మన్ జి.స్టీవెన్ తదితరులు విమర్శించారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైసీపీ పాలకులు 13 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని పెనుభారం మోపిన విషయాన్ని గుర్తు చేశారు. వైసీపీ పాలకుల అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారని విమర్శించారు. ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారన్నారు. వైసీపీ నాయకుల తప్పుడు ప్రచారాన్ని త్రిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

నిధులున్నా.. నిరుపయోగం

(5వ పేజీ తరువాయి)

యార్డులో నిర్మించారు. అయితే బీసీ కాలనీ కూడా యార్డుకు పక్కనే ఉంటుంది. అటు పూలే కానీల కూడా యార్డుకు దగ్గర్లో ఉంటుంది. విజయవాడ రోడ్డు, సుల్తానాబాద్ వంటి దూర ప్రాంత శివారుల్లో ఎక్కడా ఒక్క స్టేషన్ ఏర్పాటుకు మున్సిపాలిటీ ఆలోచనే చెయ్యలేదు. కేంద్రం నిధులిస్తోంది... నిర్మాణం కట్టమన్నారు కనుక ఎక్కడో ఒక చోట నిర్మించేస్తే పనయిపోతుందన్నట్టు పూర్తి నిర్లక్ష్యాన్ని తెనాలి మున్సిపల్ అధికారులు ప్రదర్శించారు. ఎక్కడి చెత్త అక్కడే అన్నట్టు చివరకు రూ. 2.16 కోట్లతో చత్త సమస్యకు చరమీతం పాడే అవకాశం ఉన్నా, అధికారుల ముందుచూపులేమి ఇక్కడి లక్ష్యాన్ని నీరు కార్చింది. పోనీ ఉపయోగమో! నిరుపయోగమో! వారు తలపెట్టినచోటయినా నిర్మాంచారా అంటే అదీలేదు. కంపోస్ట్ యార్డులో ఒక గదికోసం శ్లాబ్ వేసి వదిలేశారు. మిగిలిన రెండు చోట్ల అయితే పునాదుల దశలోనే ఆగిపోయి నాలుగేళ్లుగా ఎదురు చూసుతన్నాయి. అటు గుంటూరు నగరంలోనూ పలుచోట్ల నిర్మించేందుకు 223 కోట్లు, మిగిలిన నరసరావుపేట, మంగళగిరి, తాడేపల్లి, బాపట్ల, పొన్నూరు, చీరాల, అద్దంకి, మాచర్ల, పిడుగురాళ్ల, వినుకొండ, దాచేపల్లి, గురజాల, సత్తెనపల్లి వంటి మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోనూ వీటి నిర్మాణం కోసం మొత్తంమీద మరో రూ. 30.6 కోట్లు కేటాయించారు. అయితే ఒకటి, రెండు చోట్ల మినహా మిగిలిన చోట్ల ఎక్కడా పనులు చివరి దవకు చేరలేదు. వైసీపీ సర్కారు కాలంలో అసలు వీటిని పట్టించుకున్న నాధుడే లేడంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికే అన్ని మున్సిపాలిటీల్లో కంపోస్ట్ యార్డులన్నీ చెత్తతో నిండిపోయాయి. కొన్నిచోట్లయితే చెత్త గుట్టలు కొండలను తలపిస్తున్నాయి.

బయో మైనింగ్ విధానంలో పరిష్కారం దిశగా

గత ప్రభుత్వ నిర్లక్ష్యం ఇప్పుడు పట్టణాలకు శాపమయింది. పేరుకుపోయిన చెత్త గుట్టలను తొలగించటానికి, చెత్త సమస్యను అధిగమించటం కూటమి ప్రభుత్వానికి భారమే అవుతోంది. అప్పట్లో చెత్త నిదులను సద్వినియోగ పరచుకుంటే, ఇప్పుడు అంత ఖర్చు చెయ్యాల్సిన అవసరం ఉండేది కాదు. 2025 అక్టోబర్‌కు చెత్త గుట్టలే ఉండకూడదని నిర్ణయించుకుంది. దీనికోసం బయో మైనింగ్ విధానం ప్రవేపెట్టింది. దీనిద్వారా చెత్త గుట్టలను గ్రేడింగ్ చేసి, మట్టిని జల్లించి కంపోస్ట్ చేయదలిస్తే, ప్రమాదకర వ్యర్థాలను మాత్రం ఆదునిక విధానంలో నిర్వీర్యం చేస్తారు. దీనికోసం రాష్ట్రం మొత్తంమీద భారీ వ్యయమే అవుతోంది. ఒక్క తెనాలి మున్సిపాలిటీలోని చెత్తను బయో మైనింగ్ విధానంలో తొలగించటానికి రూ. 3.17కోట్లు ఖర్చవుతుంది. దీని ప్రకారంచూస్తే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మున్సిపాలిటీలన్నిటిలో రూ. 100 కోట్ల పైనే ఖర్చవుతుంది. గతంలో వచ్చిన నిధులను వినియోగించుకుంటే ఇప్పుడు ఇంత భారం పడేదికాదు. మొత్తంమీద గత ప్రభుత్వ నిర్వాకంతో పట్టణాల్లో పేరుకున్న చెత్తను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం ఒక యజ్ఞాన్నే చేపట్టినట్టయింది.

కాల్వలపై.. కూటమి నేతల కన్ను

(5వ పేజీ తరువాయి)

వ్యయం అంచనా రూ. 3.34 కోట్లు. లింగంగుంట్ల మానిటరింగ్ డివిజన్ పరిధిలో 31 పనులు, వ్యయం అంచనా రూ. 3.65 కోట్లు. ఓఅండ్ఎం సిఫ్ట్ డివిజన్ వినుకొండ పరిధిలో 34 పనులు, వ్యయం అంచనా రూ. 1.78 కోట్లు. ఈ పనులు చేపట్టేందుకు జలవనరుల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. పనుల నిర్వహణకు టెండర్లను జలవనరుల శాఖ అధికారులు నిర్వహిచారు.

మూడు డివిజన్‌లలో టెండర్లు రద్దు

సత్తెనపల్లి, నరసరావుపేట లింగంగుంట్ల ఓఅండ్ఎం, వినుకొండ సిఫ్ట్ డివిజన్‌ల పరిధిలోని కాలువల మరమ్మతు పనులకు సంబంధించిన టెండర్లు రద్దు చేశారు. మాచర్ల ఓఅండ్ఎం డివిజన్‌లో రూ. 4.69 కోట్ల వ్యయంతో 101 పనులు, లింగంగుంట్ల మానిటరింగ్ డివిజన్ పరిధిలో రూ. 3.65 కోట్ల వ్యయంతో 31 పనులకు సంబంధించిన టెండర్లు నిర్వహించారు. కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్‌లు కూడా పూర్తి చేశారు. పనులు నిర్వహిస్తున్నారు. సత్తెనపల్లి డివిజన్‌లో రూ. 3.34 కోట్ల వ్యయంతో 62 పనులు.. వినుకొండ పరిధిలో రూ. 1.78 కోట్ల వ్యయంతో 34 పనులు, లింగంగుంట్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో రూ. 4.21 కోట్ల వ్యయంతో 76 పనులు చేపట్టేందుకు అయా డివిజన్‌ల వారీగా టెండర్లు నిర్వహించారు. టెండర్ల ప్రక్రియ కాంట్రాక్టర్ల అగ్రిమెంట్ సమయంతో నిలిచిపోయింది. ఈ మూడు డివిజన్‌లలో రూ. 9.33 కోట్ల విలువైన 141 పనులు నిలిచిపోయాయి. సత్తెనపల్లి డివిజన్‌లో 62 పనులకు గాను 52 పనులకు టెండర్లు నిర్వహించగా ఐదు పనులకు సంబంధించి కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్‌లు పూర్తయ్యాయి. ఈ ఐదు పనులు చేపడుతున్నారు. ఈ డివిజన్‌లో ఇంకా 57 పనులు టెండర్లు నిర్వహించాల్సి ఉంది.

టెండర్లు నిర్వహిస్తాం

కాలువల మరమ్మతు పనులు టెండర్లు రద్దు చేయడంపై సత్తెనపల్లి డివిజన్ ఈఈ మురళీధర్, వినుకొండ ఈఈ ప్రేమ్‌కుమార్, ఓఅండ్ఎం లింగంగుంట్ల ఈఈ డీవీ సుబ్బారావును వివరణ కోరగా టెండర్లు రద్దు చేశామన్నారు. పనులు చేపట్టేందుకు మళ్లీ టెండర్లు నిర్వహించనున్నట్లు చెప్పారు.

తమ్మలూరులో వైద్య శిబిరం

60 మందికి పరీక్షలు

ముండ్లమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని తమ్మలూరులో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 'మంచం పట్టిన తుమ్మలూరు' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి 60 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి రక్త పరీక్షలు నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్ గ్రామాన్ని సందర్శించారు. గత పది నుంచి 15 రోజులుగా వర్షాలు, మంచు వాతావరణంతో వైరల్ జ్వరాలు వస్తున్నాయని తెలిపారు. ప్రధానంగా కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో దర్శి మలేరియా సబ్ యూనిట్ అధికారి బసవారెడ్డి, మారెళ్ల ప్రాథమిక వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, హెచ్‌వో వెంకటరావు, హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్త శిరీష, ఆషా తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ ఆధ్వర్యంలో గ్రామంలోని మురుగు కాలువల్లో ఎబేట్ పిచికారి చేయించారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారి ప్రవీణ్ కుమార్

అన్ని హంగులతో అక్కడే ఎన్టీఆర్ విగ్రహం

- 31వ తేదీ కౌన్సిల్‌లో ఆమోదానికి అడుగులు
- ఎమ్మెల్యే కొండయ్య సొంత నిధులు, దాతల విరాళాలతో ఏర్పాటుకు ప్రయత్నాలు

చీరాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రస్తుతం ఎన్టీఆర్ విగ్రహం ఉన్న ప్రదేశంలోనే మరింత విస్తీర్ణంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహ ఏర్పాటుకు టీడీపీ సంకల్పించింది. అందులో భాగంగా బుధవారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పలువురు నాయకులు, కార్యకర్తలతో కలసి ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. అదే స్థలంలో మరింత విస్తీర్ణంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని మరిన్ని హంగులతో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. కొందరు పాత కార్లు స్టాండ్ ప్రదేశాన్ని సూచిస్తున్నారు. అయతే బస్టాండ్ సెంటర్ అయితేనే బాగుంటుందని టీడీపీ శ్రేణులలో అత్యధికులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కొండయ్య తన సొంత నిధులతో పాటు దాతల నుంచి విరాళాలు సేకరించి ఎన్టీఆర్ విగ్రహాన్ని సుందరంగా ఏర్పాటు చేసేందుకు ఈ నెల 31వ తేదీన జరగనున్న కౌన్సిల్ సమావేశంలో అందుకు సంబంధించి ఆమోదం పొందేందుకు టీడీపీ కౌన్సిలర్లు అడుగులు వేస్తున్నారు. చీరాల రాజకీయం ఎప్పుడు రసకందాయమే. పురపాలక సంఘ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన సమయంలో వైసీపీకి అత్యధిక కౌన్సిలర్లు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పలువురు కౌన్సిలర్లు టీడీపీతో జతకట్టారు. మున్సిపల్ పరిధిలో మొత్తం 33 మంది కౌన్సిలర్లు, ముగ్గురు కోఆప్షన్ సభ్యులు ఉన్నారు. సభా సంప్రదాయం ప్రకారం కోఆప్షన్ సభ్యులకు సలహాలు, సూచనలు చేసే హక్కు ఉంటుంది. అజెండాలోని అంశాలకు సంబంధించి ఓటింగ్ అవసరమైతే చైర్మన్, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లతో ఎక్స్ అఫిషియో మెంబర్లుగా ఎమ్మెల్యే, ఎంపీలకు మాత్రమే ఓటు హక్కు ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కౌన్సిల్లో టీడీపీకి 14 మంది, వైసీపీకి 14 మంది, కాంగ్రెస్ పార్టీకి 5 మంది ఉన్నారు. గత నెల 29వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో పట్టణంలో పలువురు నేతల విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన అంశాలు చర్చకు వచ్చాయి. విగ్రహాల అంశంపై చర్చలు, వాద, ప్రతివాదనలు జరిగాయి. అందులో భాగంగా మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించి ఇచ్చిన అర్జీని అజెండాలో పొందుపరచకపోవటంపై కూడా ప్రస్తావన వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ నెల 15వ తేదీన విగ్రహాలకు సంబంధించి ప్రత్యేక సమావేశం నిర్వహించాలని భావించారు. అయితే 15వ తేదీ సమావేశం జరగలేదు. ఈ నెల 31వ తేదీ జరగనున్న కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన అజెండాలో విగ్రహాల ఏర్పాటు అంశాన్ని పొందుపరిచారు. ఈ క్రమంలో బుధవారం ఎమ్మెల్యే కొండయ్య పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించి ఎక్కడైతే బాగుంటుందనే కోణంలో పలు ప్రాంతాలను పరిశీలించారు.


బస్టాండ్ సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహ ఉన్న ప్రదేశం

అభ్యంతరం తెలిపినవారి అంగీకారంతోనే..

బస్టాండ్ సెంటర్లో ప్రస్తుతం ఎన్టీఆర్ విగ్రహం మాత్రమే ఉంది. ఆ విగ్రహం వద్దకు వెళ్లేందుకు మెట్లు కూడా లేవు. ఎన్టీఆర్ జయంతి, వర్ధంతి ఇతర ముఖ్యమైన రోజులలో తాత్కాలిక మెట్ల ద్వారా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మెట్లు నిర్మిస్తే తమకు ఇబ్బందని పలువురు చిరువ్యాపారులు కోర్టును ఆశ్రయించారు. ఆ క్రమంలో అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి మెట్లు ఏర్పాటు జరగలేదు. ఎవరైతే అభ్యంతరం తెలిపారో వారి అంగీకారంతోనే, వారి ఉపాధికి ఇబ్బంది లేకుండా, అవసరమైతే వారికి పక్కా దుకాణాలు ఏర్పాటుచేసి అక్కడే ఎన్టీఆర్ భారీ కాంస్య విగ్రహాన్ని అన్ని హంగులతో సర్వాంగసుందరంగా రూపొందించే విధంగా ఎమ్మెల్యే కొండయ్య పావులు కదిపినట్లు సమాచారం. అందుకు ఆ దుకాణదారులు కూడా అంగీకారం తెలిపినట్లు తెలిసింది.

ఎమ్మెల్యే కొండయ్యకు ఓ మైలురాయిగా..

బస్టాండ్ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహానికి మెట్లు ఏర్పాటు చేసేందుకు ఎందరు ప్రయత్నించినా ఫలించలేదు. ఆ విషయమై టీడీపీ శ్రేణులు, పార్టీలకు అతీతంగా ఎన్టీఆర్ అభిమానుల్లో అసంతృప్తి ఉంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే కొండయ్య అక్కడ అభ్యంతరం చెప్పేవారిని ఒప్పించి సుమారు సెంటు స్థలంలో ఎన్టీర్ విగ్రహ ఏర్పాటుకు మార్గం సుగమం చేసినట్లు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. అదే జరిగితే నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణుల దీర్ఘకాలిక కోరికను కొండయ్య నెరవేర్చినట్లవుతుందనడంలో సందేహం లేదు. ఇది ఆయనకు మైలురాయిగా నిలుస్తుందని టీడీపీ శ్రేణులు, నందమూరి వంశాభిమానులు అంటున్నారు.


శ్రీలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

టీడీపీ నేత శ్రీలక్ష్మికి ఎమ్మెల్యే ఏలూరి నివాళి

పర్చూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పర్చూరు పట్టణపార్టీ అధ్యక్షులు అగ్నిగుండాల వెంకట కృష్ణారావు సతీమణి తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు శ్రీలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శ్రీలక్ష్మి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వెంకట కృష్ణారావు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. శ్రీలక్ష్మి మృతి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, నాయకులు కొల్లా శివరాం ప్రసాద్, కఠారి సురేంద్రబాబు, దూళిపల్లి వెంకటస్వామి, పఠాన్ సమీర్, లక్కిపోగు సుమన్, షేక్ గౌస్ బాషా పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు దిక్సూచిలా ఉండాలి

మార్టూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి ఆదర్శంగా, విదాయర్థులకు రోల్ మోడల్‌గా ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని ఎంఈవో వస్రాం నాయక్ అన్నారు. మండలంలోని చిమ్మిరిబండ జడ్పీ హైస్కూల్‌లో సెకెండరీ గ్రేడ్ టీచరుగా పనిచేస్తున్న తాటి రత్నాకర్ ఈ నెల 31 వతేదీ ఉద్యోగ విరమణ చేయనున్నారు.ఈ మేరకు గురువారం మధ్యాహ్నం రాజుపాలెం కూడలి వద్ద ఉన్న సాయి బాలాజీ కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయుడు ఎం.ఈశ్వరప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంఈవో వస్రాం నాయక్, విశ్రాంత ఎంఈవో రామాంజనేయులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కే హనుమంతరావు, మండలంలోని పలు జడ్పీ హైస్కూళ్లకు చెందిని ప్రధానోపాధ్యాయులు పోతురాజు, చలపతి, కరిముల్లాతో పాటు ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, గరిమిడి శ్రీను, గిరి, వెంకట్రావుతోపాటు రావుల బాపయ్య, పలువురు గ్రామ పెద్దలు, మండలంలోని పలువురు ఉపాధ్యాయులు రత్నారావును శాలువాపూల మాలలతో సత్కరించారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి


తిరుపతయ్య (ఫైల్)

అద్దంకిటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మవరంలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న మేడా తిరుపతయ్య (57) గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పది రోజుల కిందట అద్దంకి పట్టణంలో బైక్‌పై వెళ్తూ కింద పడిన తిరుపతయ్యను గుంటూరు వైద్యశాలలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ తిరుపతయ్య గురువారం వేకువజామున మృతి చెందారు. మృతినికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తిరుపతయ్య మృతి చెందడం పట్ల మండలంలోని పలువురు ఉపాధ్యాయులు తమ సంతాపాన్ని తెలియజేశారు.

కేజీబీవీ విద్యార్థినులకు భోజన కష్టాలు

- వంట పనివారు డుమ్మా
- ఉపాధ్యాయులే వండుతున్న వైనం
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- తల్లిదండ్రుల ఆగ్రహం



కస్తూర్బా బాలికల విద్యాలయం

బల్లికురవ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వంట పనివారు ఒకే మారు విధులకు డుమ్మా కొట్టారు. దీంతో కస్తూర్బా విద్యార్థినులకు భోజనం కష్టాలు ఎదురయ్యాయి. వంట మనుషులు లేకపోవడంతో ఉపాధ్యాయులే అరకొరగా వంట చేసి బాలికలకు వడ్డిస్తున్నారు. 15 రోజుల నుంచి ఈ సమస్య తలెత్తినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బల్లికురవ మండల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆరు నుంచి ఇంటర్ వరకు సుమారు 250 మంది పైచిలుకు బాలికలు చదువుతున్నారు. వీరికి వంట చేసేందుకు నలుగురు ఉన్నారు. వారిలో ఒకరు ఇటీవల మృతి చెందారు. ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఒకామె మెడికల్ లీవ్‌లో ఉన్నారు. మిగిలిన ఇద్దరు విధులకు రావడం లేదు. దీంతో కేజీబీవీలో బాలికలకు వంట చేసి పెట్టే వారు కరువయ్యారు. దీంతో విద్యార్థినులు ఆకలితో అలమటిస్తున్నారు. రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రికి బాలికలకు అవసరమైన అల్పాహారం, భోజనం వండి వడ్డించాల్సి ఉంది. వంట పనివారు లేకపోవడంతో ఏదో అన్నం, కూర వరకు ఉపాధ్యాయులే వండి పెడుతున్నారు. 15 రోజులుగా విద్యాలయంలో వంట చేసే విషయంలో సమస్యలు ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వంట మనుషులు రాకుంటే ప్రత్యామ్నాయం చూసి వంట చేయించాలే గానీ సిబ్బంది వండడం ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. బడి మానేసిన (డ్రాపౌట్స్) బాలికలకు మెరుగైన విద్యను అందిచేందుకు ఏర్పాటు చేసిన విద్యాలయంలో చదువులు గాడి తప్పుతున్నాయని, బోధన చేయాల్సిన సిబ్బంది వంట చేస్తుంటే చదువులు ఎలా సాగుతాయని తల్లిదండ్రులు అంటున్నారు. విద్యాలయాల నిర్వహణ, పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంవల్లే ఇలా జరుగుతుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జిల్లా అధికారులు కేజీబీవీని పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వంట మనుషులకు నోటీసులిచ్చాం

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వంట మనుషులు విధులకు రాకపోవడంతో జిల్లా అధికారులకు సమాచారం అందించాం. వారిని తొలగించేందుకు నోటీసులు కూడా ఇచ్చాం. పదిహేను రోజుల నుంచి విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉపాధ్యాయులే వంటి చేస్తున్నారు. వంట మనుషులు ఒకే మారు విధులకు డుమ్మా కొట్టడంతో ఇబ్బంది ఏర్పడింది. కొత్త వారిని నియమించేందుకు చర్యలు చేపడుతున్నాం.

- ప్రిన్సిపాల్ సరళాకుమారి

బాలాలయం నిర్మాణానికి శంకుస్థాపన

చినగంజాం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానం ప్రాంగణంలో బాలాలయం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సీతారామాలయ పునర్ నిర్మాణంలో భాగంగా బాలాలయం నిర్మాణాన్ని చేపట్టినట్లు సీతారామాలయ కమిటీ సభ్యులు వలివేటి వెంకటరామానుజం, మోటుమర్రి రామసుబ్బారావులు తెలిపారు. సీతారామాలయం ఆలయంలో పూజలు నిర్వహించి భక్తులు భజనా కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం నుండి 41 రోజుల పాటు 41 భజన బృందాలచే ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు భజన కార్యక్రమాలను జరుపుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. తదనంతరం తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

రేపటి నుంచి గుంటుపల్లిలో రీ-సర్వే

బల్లికురవ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గతంలో నిలిచిన రీసర్వే పనులను గుంటుపల్లి రెవెన్యూలో శనివారం నుంచి తిరిగి ప్రారంభిస్తామని తహసీల్దార్ రవినాయక్ తెలిపారు. గుంటుపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న గ్రామాలకు సంబంధించిన 4573 ఎకరాలకు సంబంధించిన భూములకు ప్రత్యేక టీంల ద్వారా సర్వే చేయించి రైతులకు పూర్తి స్థాయిలో సమస్యలు లేకుండా చేస్తామని రైతులు సర్వే రోజు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ కోరారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

బల్లికురవ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలు, గాలుల ప్రభావంతో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ ఏవో కుమారి పరిశీలించారు. మండలంలోని చిన అంబడిపూడి గ్రామంలో వర్షాలతో పడిపోయిన వరి పంటలు, నీటిలో ఉన్న వరి ఓదెలను ఏవో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు ఎవరు వర్షాలు తగ్గేవరకు కోతలు కోయవద్దని అన్నారు. కోసి ఉంటే నీరు బయటకు వెళ్ల బెట్టాలన్నారు. ధాన్యాన్ని రైతులు కాపాడుకోవాలన్నారు. ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు దద్దాల అంజయ్య, అనిల్, నీటి సంఘ అధ్యక్షుడు దద్దాల విజయ్ పాల్గొన్నారు.


వరి ఓదేలను పరిశీలిస్తున్న ఏవో వెంకట కృష్ణ

ధాన్యాన్ని జాగ్రత్తగా ఉంచుకోవాలాలి

అద్దంకిటౌన్ : వర్షాల పడుతున్నందున రైతులు ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్తగా ఉంచుకోవాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. గురువారం అద్దంకి అర్బన్ పరిధిలో పోలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన పోలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో కోసిన వరి ఓదేలను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తడిసిన వరి ఓదెలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వర్షపాతం తక్కువగా నమోదు అయినందువలన పంట దెబ్బతినలేదని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం కేంద్రాలను ఏర్పాటు చేసిందని గ్రేడ్ ఏరకం క్వింటాల్‌కు రూ.2320 చెల్లిస్తున్నదని, తేమ శాతం 17లోపు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ సాయిబాబు, కోటేశ్వరరావు, శేషారావు, చింతా వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

పొటోరైటప్ః26సీజేఎం1చినగంజాం ప్రాంతంలో వరిపైర్లను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి భాస్కరరావు

వరి, శనగ పరిశీలన

చినగంజాం : మండలంలోని మోటుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో, పెదగంజాం గ్రామ ప్రాంతంలో వేసిన వరిపైరును, కడవకుదురు, చింతగుంపల్లి, గొనసపూడి, సంతరావూరు గ్రామాల్లో సాగు చేస్తున్న శనగ పంటను వ్యవసాయాధికారి కే.భాస్కరరావు గురువారం పరిశీలించారు. పంట పొలాల్లో నిలిచిన వర్షపునీటిని బయటకు పంపించుటకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా రైతులకు ఆయన సూచించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, వరి, శనగ రైతులు పాల్గొన్నారు.

తుప్పు తెగులు నివారణ చర్యలు చేపట్టాలి

యద్దనపూడి : శనగపైరులో తుప్పుతెగులు నివారణ చర్యలపై పర్చూరు ఏడీఏ ఎన్.రామ్మోహన రావు రావు రైతులకు పలు సూచనలు చేశారు. గురువారం యద్దనపూడి మండలంలోని వింజనంపాడు, చిమటావారిపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన రామ్మోహనరావు, వ్యవసాయ అధికారి మేరమ్మ శనగ పంటను పరిశీలించారు. అనంతరం రైతులతో ఏడీఏ మాట్లాడుతూ నత్రజని, భాస్వరం, పొటాషియం వినియోగంపై వాటి ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా ఎండు తెగులు నివారణా చర్యలను రైతులకు తెలియ చేశారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.


అంబడిపూడిలో వరి పంటను పరిశీలిస్తున్న ఏవో కుమారి


రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌కు భూ సమస్యను వివరిస్తున్న రైతు

భూ సమస్యలకు తక్షణ పరిష్కారం

పంగులూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు తగిన పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ సింగారావు అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రైతుల సమస్యలు తెలుసుకుని వారి నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రభుత్వం భూ సమస్యల తక్షణ పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సదస్సులను రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఆర్‌వోఆర్‌కు సంబంధించి 5, భూముల సర్వేకు సంబంధించి 3 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ బి.సురేష్, రామలింగస్వామి, పలువురు రైతులు పాల్గొన్నారు.

3న మండల సర్వసభ్య సమావేశం

బల్లికురవ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం జనవరి 3వ తేదీన ఎంపీపీ శ్రీలక్ష్మి అధ్యక్షతన జరుగుతందని ఎంపీడీవో కె.కుసుమకుమారి తెలిపారు. ఈ సమావేశంలో గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు విధిగా హాజరు కావాలని ఆమె కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు


మద్యం తాగుతున్న వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

బల్లికురవ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మందుబాబులు ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే చర్యలు తప్పవు అని ఎస్ఐ జీవీ చౌదరి హెచ్చరించారు. గురువారం బల్లికురవ ఆర్టీసీ బస్టాండ్‌లో మద్యం తాగుతున్న వారికి ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్ల వెంబడి, ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల భవనాల వద్ద మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సే వించి వాహనాలు నడిపితే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. నూతన సంవత్సర వేడుకలలో ఎవరైనా అల్లర్లకు దిగితే వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

పెద్దవాహనాలు ట్రాఫిక్ మళ్లింపు

ఇంకొల్లు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు కడవకుదురు రోడ్డులో కల్వర్టరు దెబ్బతినడంతో పెద్ద వాహనాల ట్రాఫిక్ మళ్లించారు. చీరాల, ఒంగోలు బస్సులను గురువారం నుంచి స్తూపం సెంటర్ మీదగా బస్టాండు వైపు మళ్లించాలని పంచాయతీ కార్యదర్శి అడ్డగడ్డ వెంకటేశ్వర్లు సూచించారు. కూలిన కల్వర్టరు స్థానంలో నూతన కల్వర్టరు నిర్మించాలని సంబంధిత అధికారులకు తెలియజేసామన్నారు. ఎటువంటి ప్రమాదం జరగకుండా చుట్టూ బస్తాలను ఉంచామన్నారు.

అదృశ్యమైన వ్యక్తి తిరిగి ఇంటికి

చీరాలటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గత రెండు రోజులుగా చీరాల మండలం కావూరివారి పాలెం పంచాయతీ ఆంధ్రకేసరి నగర్‌లో వ్యక్తి అదృశ్యం కథ సుఖాంతమైంది. ఆర్థిక పరమైన సమస్యలతో మనస్థాపం చెందిన డీ ఆనంద్ ఆత్మహత్మకు పాల్పడేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు తెలిపాడు. అయితే కుటుంబ పరిస్థితులు, తదితర సమస్యలు ఆలోచించి ఆత్మహత్య సరికాదని తిరిగి ఈపూరుపాలెం పోలీసులకు సమాచారం చేర వేశాడు. స్వయంగా ఇంటికి తిరిగి వచ్చేశాడు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈసందర్భంగా ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోకుండా ఆనంద్‌లా ఆలోచించి ఆనందంగా ఉండాలన్నారు.

సీఎస్సీ సెంటర్‌లో పరికరాల ధ్వంసంపై కేసు

చీరాలటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సీఎస్సీ (కామన్ సర్వీస్ సెంటర్)లో పరికరాలు ధ్వంసంపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని వాడరేవు గ్రామంలో ఎరిపిల్లి రమణయ్య సీఎస్సీ సెంటర్ నడుపుతుండగా అందులో గోసాల దుర్గా ప్రసాద్ గుమస్తాగా పని చేస్తున్నారు. ఈక్రమంలో యజమాని లేని సమయంలో అదే ప్రాంతానికి చెందిన పిక్కి రాజు అక్రమంగా చొరబడి రూ.2వేలు నగదు కావాలని డిమాండ్ చేయగా, అందుకు గుమస్తా దుర్గా ప్రసాద్ నిరాకరించారు. ఈక్రమంలో ఆగ్రహించిన రాజు సుమారు రూ.80వేలు విలువైన కంప్యూటర్, వివిధ రకాల పరికరాలను ధ్వంసం చేశాడు. ఈమేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

రాధాకు 104 సిబ్బంది వినతి

చినగంజాం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) : ప్రతి నెల 104 సిబ్బందికి వేతనం సక్రమంగా చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని 104 సిబ్బంది ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లో వంగవీటి మోహన్‌రంగా కాంస్య విగ్రహం ఆవిష్కరణకు గురువారం సోపిరాల వచ్చిన వంగవీటి రాధాకు 104 సిబ్బంది తమ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. జీవో నెంబరు 7ప్రకారం 104లో పనిచేస్తున్న డ్రైవర్లు, డీఈవోలకు వేతనాలు చెల్లించాలని, మూడేళ్లగా యాజమాన్యం అధీనంలో ఉంచుకున్న ఇంక్రిమెంట్లు ఏరియర్స్ రూపంలో ఇవ్వాలని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పనికి తగ్గ వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని లేకుంటే సమ్మె బాట పడతామని 104 ఉద్యోగులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 104 డీఈవో పొదిలి రాఘవ, 104 పైలెట్ విజయ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ శతాబ్ది ఉత్సవాలు

అద్దంకిటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ సమగ్రత, ఐక్యత కోసం అలుపెరగని పోరాటాలు చేసిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అని మాజీ ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జల్లి విల్సన్ అన్నారు. గురువారం అద్దంకి నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల వేడుకను స్థానిక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జెండాను విల్సన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి తన్నీరు శింగరకొండ, భాగ్య శ్రీధర్, కేఎల్‌డీ ప్రసాద్, తుమ్మల చంద్రశేఖర్, గన్నెపూడి ప్రసాద్, కాలేషా, ఖాదర్ బాషా, రిక్షావర్కర్స్ యూనియన్ నాయకులు చిలక యేసు, అరిగల గురవయ్య, ఆకుల పిచ్చయ్య, మలాది వెంకట్రావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు విల్సన్